- aruhi group

www.mahaaprabha.com

# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

శుక్రవారం
22-05-2026

సంపుటి : 01 సంచిక : 61 పేజీలు : 08 వెల : ₹5/- తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.



Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE 61 NAMASTEY MAHAAPRABHA


## లిక్కర్‌పై.. జెన్‌జీ అనాసక్తి!

### ఆల్కహాల్‌కు దూరం దూరం



- ఆరోగ్యమే ముఖ్యమంటున్న నేటి తరం
- నాలుగేళ్లలో తగ్గిన రూ.70 వేల కోట్ల అమ్మకాలు
- ప్రీమియం బ్రాండ్స్ లిక్కర్ షేర్లు భారీగా పతనం

**న్యూఢిల్లీ, మే 21 (మహాప్రభ):**
ఈతరం జెన్ జీ ఆలోచ నలు, అలవాట్లు పూర్తిగా మారుతున్నాయి. ముఖ్యంగా మద్యం తాగే విషయంలో వారు మును పటిలా ఆసక్తి చూపించడం లేదు. ఆరోగ్యంపై శ్రద్ధ పెరగడం, సరికొత్త లైఫ్‌స్టైల్ ట్రెండ్స్ పాలో అవ్వడం వల్ల ఆల్కహాల్‌కు దూరంగా ఉంటున్నారు. దీని ప్రభావం గ్లోబల్ లిక్కర్ మార్కెట్‌పై తీవ్రంగా పడింది.

-మిగతా 3 లో


## ఎబోలా పై కేంద్రం హై అలర్ట్



- భారత్‌కు వచ్చే విదేశీ ప్రయాణికులకు అడ్వైజరీ జారీ
- ఇండియా, ఆఫ్రికా సదస్సు వాయిదా

**న్యూఢిల్లీ మే 21 (మహాప్రభ):**
ప్రపంచవ్యాప్తంగా ఎబోలా వైరస్ కలకలం రేపుతున్న వేళ కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఎబోలా తీవ్రత ఎక్కువగా ఉన్న ఆఫ్రికా దేశాల నుంచి భారతదేశానికి వచ్చే ప్రయాణికుల కోసం కేంద్ర ఆరోగ్య శాఖ అడ్వైజరీ జారీ చేసింది. ఈ మేరకు ఆరోగ్య శాఖ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ కీలక ఆరోగ్య

-మిగతా 3 లో




## నిప్పులకొలిమి

- ఎండదెబ్బకు అట్టుడుకుతున్న తెలంగాణ
- 20 జిల్లాల్లో 46 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు
- ఈనెల 25 వరకు వడగాలులు వీస్తాయన్న వాతావరణశాఖ
- మధ్యాహ్నం సమయంలో బయటకు రావొద్దని ప్రజలకు సూచన

**హైదరాబాద్ : మే 21 (మహాప్రభ):**
రాష్ట్రం నిప్పుల కొలిమిలా మండిపోతోంది. భానుడి సెగతో అట్టుడుకుతోంది. అధిక వేడితో కూడిన వడగాలులకు ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఉక్కపోతకు ఇంట్లో ఉండలేక వేడిగాలులకు బయటకు రాలేక నానా తంటాలు పడుతున్నారు. గురువారం రాష్ట్రంలోని 20 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలకు పైనే నమోదయ్యాయి. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజలు బయటకు రావొద్దని వైద్యులు సూచిస్తున్నారు. మరోప క్క ఈ వడగాలులు ఈనెల 25 వరకు వీస్తాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

-మిగతా 3 లో

## కార్మికులకు ప్రభుత్వం శుభవార్త

### కనీస వేతనాలు అమలుకు నిర్ణయం

- కేబినేట్ సబ్‌కమిటీ నిర్ణయాలకు ఆమోదం
- లబ్దిపొందనున్న 1.11 కోట్ల మంది కార్మికులు
- బండి తనయుడు భగీరథను పోలీసులే అరెస్ట్ చేశారు
- కెటిఆర్ ఇంకా ప్రభుత్వంలోనే ఉన్నాడన్న భ్రమలో ఉన్నారు
- మీడియా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మే 21 (మహాప్రభ):**
కార్మికులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పారు. కనీస వేతనాలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర సచివాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి కీలక విషయాలను వెల్లడించారు. కార్మికుల కనీస వేతనాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని సీఎం రేవంత్ తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో 1.11 కోట్ల మంది కార్మికులు నష్టపోయా రని.. అందుకే ఉప ముఖ్యమంత్రి భట్టి

-మిగతా 3 లో






## పంటల కొనుగోలుపై ఎన్నాళ్లీ మొద్దునిద్ర?

- సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ బహిరంగలేఖ
- రైతుల ప్రాణాలు పోతున్నా పంటలు కొనరా?
- ధాన్యం తగులబెట్టుకున్నా తండ్లాట తీర్చరా?
- కేంద్రాల్లోనే కుప్పకూలుతున్నా కనికరించరా?
- రైతులే రేపు సర్కార్‌కు కీలెరిగి వాతలు పెడుతరు
- 30 నెలల్లో సమైక్య పాలననాటి పరిస్థితులు

**హైదరాబాద్, మే 21 (మహాప్రభ):**
'పంటల కొనుగోలుపై ఎన్నాళ్లీ ఈ మొద్దునిద్ర? రైతుల ప్రాణాలు పోతున్నా పంటలు కొనరా? కొనుగోలు కేంద్రాల్లోని వడ్ల రాశులపైనే కుప్పకూలుతున్నా కనికరించరా? కడుపు మండి ధాన్యం తగులబెట్టుకున్న అన్నదాతల తండ్లాట తీర్చరా? పంటలనే నమ్ముకొని రైతులు సంబురపడాల్సిన కొనుగోలు కేంద్రాల్లో ఈ మరణ మృదంగమేమిటి? చేతగాని, చేవచచ్చిన సర్కార్ వైఫల్యానికి పరాకాష్ట కాదా?' అని రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ తీరుపై, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్లక్ష్య వైఖరిపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి గురువారం కేటీఆర్ లేఖ రాశారు. పండించిన పంట ఉత్పత్తులను అమ్ముకొనేందుకు రెండు నెలలుగా అన్నదాత పడుతున్న కష్టాలను ఆ లేఖలో ఏకరువు పెట్టారు. నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్న ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంలో రోడ్డెక్కని రైతులేడని, రాస్తారోకో జరుగని రహదారి లేదని పేర్కొన్నారు. నేడు ప్రభుత్వాన్ని బూతులు తిడుతున్న

-మిగతా 3 లో



## విజయ్ తొలి మంత్రివర్గ విస్తరణ

- ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు చోటు
- మంత్రిగా ప్రమాణం చేస్తూ రాహుల్ గాంధీ ప్రస్తావన
- వివాదమవుతున్న కొత్త మంత్రుల తీరు

**చెన్నై: మే 21 (మహాప్రభ):**
ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళనాడు ప్రభుత్వం విస్తరించింది. తొలి మంత్రివర్గ విస్తరణలో భాగంగా టీవీకే, కాంగ్రెస్‌కు చెందిన నాయకులు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. అయితే, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మంత్రి ఒకరు ప్రమాణం చేస్తూ ఆ పార్టీ అగ్రనేతల పేర్లను ప్రస్తావించడం వివాదానికి దారితీసింది.

-మిగతా 3 లో



## జూన్ 2 తర్వాత మద్యం ధరల బాదుడు!

- తయారీ వ్యయం పెరగడమే ధరల పెంపునకు ప్రధాన కారణం
- 10 నుంచి 15 శాతం మేర పెంపునకు మొగ్గు చూపుతున్న ప్రభుత్వం
- అధికారిక ప్రకటన వెలువడే అవకాశం



3 లో

## దేశంలో కాక్రోచ్ ప్రకంపనలు!

### 5 రోజుల్లో ఇన్‌స్టాగ్రామ్‌లో 1.6 కోట్ల మంది ఫాలోవర్లు


- జాతీయ పార్టీలు బీజేపీ, కాంగ్రెస్ ఖాతాల్ని దాటేసి ఎంతో ముందుకు
- లీగల్ డిమాండ్ పేరిట సీజేపీ ఎక్స్ ఖాతా నిలిపివేత
- 'కాక్రోచ్ ఈజ్ బ్యాక్' పేరిట వెంటనే కొత్త ఖాతా షురూ
- సీజేపీపై హక్కులను కోరుతూ 3 ట్రేడ్‌మార్క్ దరఖాస్తులు

**హైదరాబాద్, మే 21 (మహాప్రభ):**
నిరుద్యోగులను బొద్దింకలతో పోల్చుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ చేసిన వ్యాఖ్యల కారణంగా పుట్టుకొచ్చిన వ్యంగ్య రాజకీయ పార్టీ 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) దేశంలో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. గత శనివారం ప్రారంభమైన ఈ పార్టీ పేజీలను సోషల్ మీడియాలో ఫాలో అయ్యే నెటిజన్ల సంఖ్య అంతకంతకూ పెరిగిపోతున్నది. ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రస్తుతం ఈ పార్టీని 1.6 కోట్ల మంది ఫాలో అవుతున్నారు

-మిగతా 3 లో





3 లో

## పాక్ నుంచే పహల్గాం దాడి కుట్ర

- ఎన్ఐఏ ఛార్జ్‌షీట్‌లో సంచలన విషయాలు
- 'ఫాల్స్ ఫ్లాగ్' ప్రచారాన్ని కూడా పాక్ నడిపినట్లు వెల్లడి
- పాక్‌లో కొనుగోలు చేసిన మొబైల్ ఫోన్లు, టెలిగ్రామ్ ఛానళ్లతో కీలక ఆధారాలు



3 లో

## పుల్వామా దాడి సూత్రధారి హతం..

- పీవోకేలో కాల్చిచంపిన గుర్తు తెలియని వ్యక్తులు
- 40 మంది సీఆర్‌పీఫ్ జవాన్ల సజీవ దహనానికి కారణమైన పుల్వామా దాడితో పాటు కశ్మీర్‌లో పలు ఉగ్రవాద కార్యకలాపాల్లో అతడి ప్రమేయం

## కాళేశ్వరంలో సరస్వతీ అంత్య పుష్కరాలు ప్రారంభం..

- పోటెత్తిన భక్తులు
- తొలి పుణ్యస్నానం ఆచరించిన కంచి పీఠాధిపతి, మంత్రులు
- 12 రోజుల పాటు కొనసాగనున్న పుష్కర వేడుకలు
- గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల పవిత్ర త్రివేణి సంగమం ఇది
- భక్తుల కోసం ప్రభుత్వం భారీ ఏర్పాట్లు



**హైదరాబాద్ : మే 21 (మహాప్రభ):**
జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కాళేశ్వరంలో సరస్వతీ అంత్య పుష్కరాలు గురువారం ఉదయం వైభవంగా ప్రారంభమయ్యాయి. కంచి మఠం పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి తొలి పుణ్యస్నానం ఆచరించి పుష్కరాలను లాంఛనంగా ప్రారంభించారు. ఉదయం 5:43 గంటలకు ఆయనతో పాటు రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు దంపతులు పవిత్ర స్నానం

-మిగతా 3 లో


# జార్ఖండ్‌లో 27 మంది మావోయిస్టులు లొంగుబాటు




**న్యూఢిల్లీ, మే 21 (మహాప్రభ):**
జార్ఖండ్ లో గురువారం భారీ సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోయారు. ఆ రాష్ట్ర డీజీపీ తదాషా మిస్త్రీ సమక్షంలో లొంగిపోయారు. మొత్తం 27 మంది మావోలు జార్ఖండ్ పోలీసు సీనియర్ అధికారుల ఎదుట ఆయుధాలతో లొంగిపోయినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇది జార్ఖండ్ చరిత్రలోనే రికార్డు. వీరిలో చాలామంది మోస్ట్ వాంటెడ్ మావోయిస్టులు కూడా ఉన్నట్లు తెలిపారు.ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ నవజీవన్‌కు ప్రభావితమై వీరు జనజీవన ప్రవంతిలోకి వచ్చినట్లు వెల్లడించారు. 2026లో రాష్ట్రంలో 22 మంది మావోయిస్టులను మట్టుబెట్టగా.. 44 మందిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. 29 మంది లొంగిపోయారన్నారు. మిగిలినవారు జనజీవన ప్రవంతిలోకి చేరినట్లు పేర్కొన్నారు. ఇవాళ లొంగిపోయిన 27 మందికి పునరావాసం కల్పిస్తామని అధికారులు వెల్లడించారు. గురువారం లొంగిపోయిన వారిలో మావోయిస్టు పార్టీ చివరి యాక్టివ్ పోలిట్ బ్యూరో సభ్యుడు మిశ్ర్ బస్త్ర అలియాస్ సాగర్‌జీ కూడా ఉండే అవకాశం ఉందని తొలుత మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అయితే ఇప్పటివరకు అధికారుల నుంచి వెలువడిన ప్రకటనలో మాత్రం ఆయన పేరు ప్రస్తావన లేదు. తాజాగా లొంగిపోయిన వారిలో ఆయన సన్నిహిత బృందంలోని టాప్ కమాండర్‌లు, స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు, ఏరియా కమిటీ సభ్యులు ఉన్నట్లు తెలుస్తోంది.

# ఎవరెస్ట్ పైకి ఒక్క రోజులోనే 274 మంది

### ఆ బృందంలో ముగ్గురు భారతీయులు



**న్యూఢిల్లీ, మే 21 (మహాప్రభ):**
ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ఎవరెస్ట్ ను ఒక్క రోజులో 274 మందితో కూడిన బృందం అధిరోహించి కొత్త రికార్డు నెలకొల్పింది. ఎవరెస్టును ఒక్క రోజులో అత్యధికంగా ఇంత మంది ఆధిరోహించడం ఇదే మొదటిసారి. ఈ బృందంలో ముగ్గురు భారతీయులు కూడా ఉండటం విశేషం. "150 మంది నేపాలీ షెర్పాలతో సహా ఈ పర్వతారోహకులు బుధవారం ఒక్క రోజులోనే శిఖరాన్ని చేరుకున్నారు" అని నేపాల్‌లోని ఎక్స్‌పెడిషన్ ఆపరేటర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రిషి రామ్ భండారి గురువారం మీడియాకు తెలిపారు. ప్రపంచ రికార్డు సృష్టించిన ఈ బృందంలో ముగ్గురు భారతీయులు తులసి రెడ్డి పాల్పునూరి, సందీప్ ఆరే, అజయ్ పాల్ సింగ్ ధాలివాల్ ఉన్నారు. గతంలో అంటే 2019 మే నెలలో ఒకే రోజులో 223 మంది ఎవరెస్టు ను ఆధిరోహించిన రికార్డును ఈ బృందం అధిగమించిందని భండారి తెలిపారు. అలాగే 2026 సీజన్ లో ఎవరెస్ట్‌ను అధిరోహించడానికి 502 మంది పర్వతారోహకులకు నేపాల్ ప్రభుత్వం అనుమతించిందని తెలిపారు.

# ఆర్థిక వ్యవస్థలో ప్రధాని మోడీకి జ్ఞానం అవసరం

**న్యూఢిల్లీ, మే 21 (మహాప్రభ):**



ప్రధాని మోడీ జ్ఞానేష్ సాయంతో ఎన్నికల్లో విజయం సాధిస్తున్నారని, ఆర్థిక వ్యవస్థలోనూ ఆయనకు జ్ఞానం అవసరమని గురువారం కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ప్రతినిధి జైరామ్ రమేష్ విమర్శించారు. భారత ప్రధాన ఎన్నికల కమిషన్ జ్ఞానేష్ కుమార్‌ను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారతదేశ ఆర్థిక విధాన రూపకల్పనలో సమూల మార్పు అవసరమని, కానీ మోడీ ప్రభుత్వానికి ఈ ఆలోచన రావడం లేదని అన్నారు. భారత ఆర్థిక వ్యవస్థపై సెంటిమెంట్ ఎంతగా దిగజారిందంటే, మోడీ ప్రభుత్వానికి వృత్తిపరమైన మద్దతుదారులు కూడా తమ ఆందోళనలను బహిరంగంగా వ్యక్తం చేయడం ప్రారంభించారని అన్నారు. "ద్రవ్యోల్బణ అంచనాలు తీవ్రంగా పెరుగుతుండగా, వృద్ధి అంచనాలు గణనీయంగా తగ్గాయి. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ద్రవ్యోల్బణ అంచనాలు తీవ్రంగా పెరుగుతుండగా, వృద్ధి అంచనాలు గణనీయంగా తగ్గాయి. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్ డి ఐలు ) క్షీణిస్తూనే ఉన్నాయి. సరఫరా గొలుసులను (సప్లై చైన్‌లను) ఎంత దారుణంగా నిర్వహించారంటే, వినియోగదారులు తమ వినియోగాన్ని తగ్గించుకోవాలని ప్రధాని మోడీ ప్రజలకు ఇప్పుడు బహిరంగంగా సూచించారు " అని ఆయన అన్నారు. ఈ ఆందోళనలు కొత్తవి కావని.. గత కొంతకాలంగా కాంగ్రెస్ హెచ్చరిస్తూనే ఉందని అన్నారు. అత్యంత ముఖ్యమైనది మందకొడి పెట్టుబడి వాతావరణానికి సంబంధించినదని అన్నారు. ఇటలీ ప్రధాని మెలోనికి ప్రధాని మోడీ టోఫీలు బహుమతిగా ఇవ్వడాన్ని ప్రస్తావిస్తూ, మన ప్రధాని టోఫీలు పంచుతూ, ప్రజలకు విజ్ఞప్తులు చేయడంలో నిమగ్నమై ఉన్నారని విమర్శించారు. దేశం కాళ్ల కింద నేల జారిపోతోందని, ఆర్థిక విధాన రూపకల్పనలో మనకు సమూలమైన మార్పు అవసరమని, కానీ మోడీ ప్రభుత్వానికి యథావిధిగా ఆత్మస్తుతి చేసుకోవడం తప్ప వేరే ఆలోచనలు లేకుండా పోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# 'నీట్' పేపర్ లీకవ్వలే.. కొన్ని ప్రశ్నలే బయటకొచ్చాయి..!

**న్యూఢిల్లీ, మే 21 (మహాప్రభ):**
నీట్' యూజీ ప్రశ్నప్రత్రం లీకేజీపై విమర్శలు వస్తున్న వేళ ఎన్టీఏ అధికారులు తమ తప్పును కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేశారు. నీట్ పేపర్ లీకవ్వలేదని, కొన్ని ప్రశ్నలు మాత్రమే బయటకు వచ్చాయని పార్లమెంటరీ స్థాయి కమిటీకి స్పష్టం చేశారు. అందరూ అనుకుంటున్నట్టుగా మే 3వ తేదీన జరిగిన నీట్ యూజీ పరీక్ష పేపర్ పూర్తిగా లీకవ్వలేదని, కొన్ని ప్రశ్నలు మాత్రమే లీకయ్యాయని ఎన్టీఏ చీఫ్ అభిషేక్ సింగ్ పార్టీమెంటరీ కమిటీకి తెలిపారు.వైద్య విద్యలో ప్రవేశాల కోసం మే 3న నిర్వహించిన నీట్ పరీక్ష లీకేజీ దేశవ్యాప్తంగా కలకలం సృష్టించింది. లీకేజీ వ్యవహారంలో పరీక్షకు హాజరైన 22 లక్షల మంది విద్యార్థులు కంగుతిన్నారు. ఈ ఘటనపై విచారణ చేపట్టిన పార్లమెంటరీ స్థాయి కమిటీ ఎన్టీఏ




అధికారులను ప్రశ్నించగా వారు పేపర్ పూర్తిగా లీకవ్వలేదని, కొన్ని ప్రశ్నలే బయటకు వచ్చాయని వివరించారు.'నీట్ పరీక్షలో కొన్ని అవకతవకలు జరిగాయి. అంతేతప్ప పూర్తిగా ప్రశ్నపత్రం లీకవ్వలేదు. నీట్ పరీక్షను లీకేజీకి ఆస్కారమివ్వకుండా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నాం. పేపర్ బయటకు రావడాన్ని ఏమాత్రం సహించని కారణంగానే పరీక్షను రద్దు చేశాం' అని ఎన్టీఏ అధ్యక్షుడు అభిషేక్ సింగ్, ఉన్నత విద్యా శాఖ సెక్రటరీ వినీత్ జోషి పార్లమెంటరీ కమిటీకి వెల్లడించారు. నీట్ పరీక్షను తిరిగి జూన్ 21న నిర్వహిస్తున్నట్టు ఎన్టీఏ ఇదివరకే ప్రకటించింది.

**సూత్రధారి సహా పలువురి అరెస్ట్**
నీట్ లీకేజీపై విచారణ చేపట్టిన కేంద్ర దర్యాప్తు సంస్థ సూత్రధారులు సహా పలువురిని అరెస్ట్ చేసింది. లీకేజీతో సంబంధమున్న ప్రొఫెసర్ మనీషా గురునాథ్ మంధరే, శివరాజ్ మొటెగావ్‌క్కర్, రసాయనశాస్త్ర ప్రొఫెసర్ పీవీ కులకర్ణి, మనోజ్ శిరురే(పిడియాట్రిషియన్)తో పాటు.. మనీషా వాగ్మరేను సైతం సీబీఐ అదుపులోకి తీసుకుంది. అలానే.. ఢిల్లీ, జైపూర్, గురుగ్రామ్, నాశిక్‌లో పలువురిని అరెస్ట్ చేసింది.

# ఇకపై మద్రాసాలలో కూడా వందేమాతరం తప్పనిసరి..

### బెంగాల్ ప్రభుత్వం ఆదేశాలు

**న్యూఢిల్లీ, మే 21 (మహాప్రభ):**
వందేమాతరం ఆలపించే విషయంలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై పాఠశాలలతోపాటు రాష్ట్రంలో నడిచే మద్రాసాలలో కూడా వందేమాతరం చదవడాన్ని తప్పనిసరి చేసింది. ప్రభుత్వ గుర్తింపు పొందిన మద్రాసాలలో వందేమాతరాన్ని ఉదయం తప్పనిసరిగా ఆలపించాల్సిందే అంటూ రాష్ట్ర విద్యాశాఖ తరఫున డైరెక్టరేట్ ఆఫ్ మద్రాసా ఆధ్వర్యంలో ఆదేశాలు జారీ చేసింది.ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొంది. పశ్చిమ బెంగాల్‌లో అనేక మద్రాసాలు మైనారిటీ వ్యవహారాల శాఖ, మద్రాసా విద్యా విభాగం



ఆధ్వర్యంలో నడుస్తుంటాయి. ప్రభుత్వ గుర్తింపు పొందిన వాటిల్లోనే కాకుండా, ఎయిడెడ్, నాన్ ఎయిడెడ్ మద్రాసాలలో తరగతులు ప్రారంభించే ముందు ఇకపై వందేమాతరం చదవాలి. సువేందు అధికారి సీఎంగా అధికారం చేపట్టిన రెండు వారాల వ్యవధిలోనే బెంగాల్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం. వందేమాతరం ఆలపించడానికి సంబంధించి గతవారమే ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. విద్యాశాఖ పరిధిలోకి వచ్చే ప్రతి పాఠశాలలో ఆరు భాగాల వందేమాతరాన్ని తప్పనిసరిగా ఆలపించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఉదయం తరగతులు ప్రారంభమయ్యే ముందు విద్యార్థులు తప్పనిసరిగా వందేమాతరం ఆలపించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. వందేమాతరం చుట్టూ ఇటీవల కొంత వివాదం జరుగుతోంది. బంకించంద్ర ఛటర్జీ రాసిన వందేమాతరాన్ని తప్పనిసరిగా ఆలపించాలని కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్‌డీయే ప్రభుత్వం ఆదేశించింది. వందేమాతర గీతం దేశంలో రాజకీయంగా, సాంస్కృతికంగా గుర్తుగా నిలిచిందని కేంద్రం పేర్కొంది. జాతీయ గేయంతో సమానంగా జాతీయ గీతాన్ని కూడా గౌరవించాలని కేంద్రం పేర్కొంది.

# ఇన్‌స్టాగ్రామ్‌లో సరికొత్త రికార్డు..

### కాంగ్రెస్, బీజేపీలను దాటేసిన 'కాక్రోచ్ జనతా పార్టీ'!

**న్యూఢిల్లీ, మే 21 (మహాప్రభ):**
భారతదేశ సోషల్ మీడియా చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఒక వినూత్న డిజిటల్ విప్లవం నడుస్తోంది. కేవలం ఒక కామెంట్ వలన ప్రారంభమైన కాక్రోచ్ జనతా పార్టీ అనే రాజకీయ ఉద్యమం, కేవలం నాలుగైదు రోజుల్లోనే కాంగ్రెస్, బీజేపీ వంటి దేశంలోని అతిపెద్ద అధికారిక రాజకీయ పార్టీల ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్ల సంఖ్యను దాటేసి సరికొత్త రికార్డు సృష్టించింది. ప్రస్తుతం ఇన్‌స్టాగ్రామ్‌లో బీజేపీకి సుమారు 8.7 మిలియన్ల ఫాలోవర్లు ఉండగా, కాంగ్రెస్‌కి 13.2 మిలియన్ ఫాలోవర్లు ఉన్నారు. అయితే ఈ రెండింటిని దాటేసి 13.6 మిలియన్ ఫాలోవర్లతో దూసుకుపోతోంది ఈ కాక్రోచ్ జనతా పార్టీ.ఇటీవల ఒక కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ, ఉద్యోగాలు లేక సమాజంలో సరైన




స్థానం దొరకని కొందరు యువకులు సోమరిపోతులుగా, బొద్దింకలుగా, సమాజ పరాన్నజీవులుగా మారిపోతున్నారని, వారంతా జర్నలిస్టులు, ఆర్‌టీఐ కార్యకర్తలు, సోషల్ మీడియా ముసుగులో వ్యవస్థలపై దాడులు చేస్తున్నారంటూ కామెంట్లు చేశాడు. అయితే దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, అవినీతి, రుపాయి పతనం, ఇంధన ధరలు, పేపర్ లీకేజీల సమస్యలతో ఇప్పటికే తీవ్ర అసంతృప్తితో ఉన్న యువతకు ఈ వ్యాఖ్యలు తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించాయి. ఇక వ్యవస్థ తమను బొద్దింకలుగా చూస్తే, ఆ బొద్దింకలన్నీ ఏకమైతే ఎలా ఉంటుందో చూపిస్తామంటూ అభిజీత్ దిప్కే అనే వ్యక్తి ఈ 'కాక్‌రోచ్ జనతా పార్టీ'ని స్థాపించాడు. దీంతో ఈ పార్టీని స్థాపించి సోషల్ మీడియాలో జాయిన్ అయితే కొద్ది గంటల్లోనే ఈ పార్టీకి విపరీతమైన మద్దతు లభించింది. ప్రస్తుతం ఇన్‌స్టాగ్రామ్‌తో పాటు, ఎక్స్, ఫేస్‌బుక్ తదితర సోషల్ మీడియాలలో ఈ పార్టీకి దూసుకుపోతుంది. మరోవైపు ఇది కేవలం ఫన్ కోసం పెట్టిన పార్టీలా కనిపిస్తున్నా, దేశంలోని నిరుద్యోగం, నీట్ పేపర్ లీకేజీలు, పరీక్షల కుంభకోణాలపై యువత నిరసనను తెలియజేయడానికి 5 ముఖ్యమైన డిమాండ్లను తెరపైకి తెచ్చింది. జడ్జీలకు పదవీ విరమణ తర్వాత ఎలాంటి రాజకీయ ప్రయోజనాలు కల్పించకూడదని, పార్టీలు మారే ప్రజాప్రతినిధులపై సుదీర్ఘకాలం పాటు ఎన్నికల నిషేధం విధించాలని, తాము కూడా ఆర్‌టీఐ పరిధిలోకి వస్తామని, పార్లమెంట్‌లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో పాటు తప్పుడు వార్తలు ప్రచారం చేసే మీడియా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ పార్టీ డిమాండ్ చేస్తోంది.

# అఫ్ఘాన్‌లో దారుణ పరిస్థితులు

### కూటి కోసం కూతుళ్ల విక్రయం..


**న్యూఢిల్లీ, మే 21 (మహాప్రభ):**
ఆర్థికంగా చితికిపోయిన అఫ్ఘనిస్థాన్ నుంచి వేదనకు గురిచేసే ఉదంతాలు వెలుగుచూస్తున్నాయి. తిండి, వైద్య ఖర్చులు, రుణ విముక్తి కోసం నిరుపేద కుటుంబాలు ముక్కుపచ్చలారని తమ కుమార్తెలను అమ్ముకుంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. అంతులేని నిరుద్యోగం, అధ్వానంగా మారిన ఆరోగ్య రక్షణ వ్యవస్థ, క్షీణించిన అంతర్జాతీయ సహాయం నడుమ అఫ్ఘాన్‌లోని ప్రతి నలుగురు పౌరులలో ముగ్గురు తమ ప్రాథమిక అవసరాలు కూడా తీర్చుకోలేని దుస్థితిలో



ఉన్నట్లు ఐక్యరాజ్యసమితి తెలిపింది. అఫ్ఘాన్ జనాభాలో 10 శాతం మంది అంటే దాదాపు 47 లక్షల మంది దుర్భిక్షానికి అడుగు దూరంలో ఉన్నట్లు యూఎన్ అంచనా వేసింది.దేశవ్యాప్తంగా ఆహారం కోసం ప్రజలు అల్లాడుతున్న నేపథ్యంలో ఘోర్ ప్రావిన్సులో పేదరికం, నిరుద్యోగంతో పోరాడుతున్న తండ్రులు విధిలేని పరిస్థితుల్లో అసాధారణ పనులకు పాల్పడవలసి వస్తోందని బీబీసీ తెలిపింది. కటిక పేదరికం, అప్పులు, ఉపాధి లేకపోవడం వంటి సమస్యల కారణంగా కుటుంబాన్ని పోషించే మార్గం లేక తన ఏడేండ్ల కవల కుమార్తెలలో ఒక బాలికను విక్రయించాలని యోచిస్తున్నట్లు అదే ప్రావిన్సుకు చెందిన అబ్దుల్ రషీన్ అజీమీ రోదిస్తూ బీబీసీకి తెలిపాడు. సయీద్ అహ్మద్ అనే మరో తండ్రి మాట్లాడుతూ అపెండిసైటిస్, కాలేయంలో గడ్డతో బాధపడుతున్న తన ఐదేండ్ల కుమార్తెకు వైద్య చికిత్స ఇప్పించే స్తోమత లేక తన బంధువుకు అమ్ముకున్నట్లు చెప్పారు.

# రేవంత్ రెడ్డి పీఏ" పేరుతో వసూళ్లు.. వ్యక్తి అరెస్ట్

**శివంపేట మే 21 (మహాప్రభ):**
మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలో మరో మోసగాడి వ్యవహారం వెలుగులోకి వచ్చింది. తాను తెలంగాణ ముఖ్యమంత్రి పీఏ నని చెప్పుకుంటూ వ్యాపారవేత్తలను బెదిరించి డబ్బులు వసూలు చేయడానికి ప్రయత్నించిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. శివంపేట మండలం మునీరాబాద్ గ్రామ శివారులోని ఆర్‌ఆర్ రియల్ ఎస్టేట్ సంస్థ యజమానికి ఫోన్ చేసిన శివంపేట గ్రామానికి చెందిన ఉప్పల సంతోష్ గుప్తా, తాను సీఎం పీఏనని పరిచయం చేసుకున్నాడు. సంస్థకు చెందిన భూమి సమస్యలో ఉందని, రాష్ట్ర మంత్రులతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని చెబుతూ డబ్బులు డిమాండ్ చేసినట్లు సమాచారం. "డబ్బులు ఇస్తే మీ సమస్యలన్నీ పరిష్కరిస్తాను" అంటూ సంస్థ యజమానిపై ఒత్తిడి తెచ్చినట్లు తెలుస్తోంది. దీంతో అనుమానం వచ్చిన ఆర్‌ఆర్



రియల్ ఎస్టేట్ సంస్థ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు ఉప్పల సంతోష్ గుప్తాను అరెస్ట్ చేశారు. మంత్రులతో దిగిన ఫోటోలను చూపిస్తూ వ్యాపారవేత్తలను బెదిరించి డబ్బులు వసూలు చేసే ప్రయత్నం చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

# లిక్కర్‌పై.. జెన్‌జీ అనాసక్తి!

మొదటి తరువాయి

కేవలం నాలుగేళ్ల లోనే ప్రపంచంలోని టాప్ మద్యం కంపెనీలు ఏకంగా 830 బిలియన్ డాలర్స్ మార్కెట్ విలువను కోల్పోయాయి.

**కంపెనీల మార్కెట్ వాల్యూ అతలాకుతలం**

బ్లూమ్‌బెర్గ్ రిపోర్ట్ ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న దాదాపు 50 ప్రధాన మద్యం కంపెనీల షేర్లు ఘోరంగా పడిపోయాయి. ఇక జూన్ 2021 నాటి పీక్ స్టేజ్‌తో పోలిస్తే ఇప్పుడు ఈ కంపెనీల మార్కెట్ వాల్యూ 46% మేర పతనమైంది. జనాభా మద్యం తాగడం తగ్గించడమే ఇందుకు ప్రధాన కారణమని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

**బ్రాండెడ్ కంపెనీల షేర్లలో భారీ క్షీణత**

మనం రెగ్యులర్‌గా వినే డియాజియో, పెర్నోడ్ రికార్డ్, జాక్ డానియెల్స్ లాంటి పెద్ద పెద్ద ఇంటర్నేషనల్ బ్రాండ్ల షేర్లు గత ఐదేళ్లలో ఎన్నడూ లేనంత గరిష్ట స్థాయికి పడిపోయాయి. ఇక ఫ్రెంచ్ చెందిన ఫేమస్ బ్రాండ్ 'రెమి కొయింట్రో' షేర్లు కూడా 2021తో పోలిస్తే 40% పైగా నష్టపోయాయి.

**మారిన కుర్రాళ్ల ట్రెండ్.. సెలబ్రిటీల ప్రభావం**

ఇప్పుడున్న యూత్ ఆల్కహాల్‌ను ఒక క్రేజీ విషయంగా చూడటం లేదు. హాలీవుడ్ స్టార్స్ టామ్ హాలాండ్, కేటీ పేర్రీ లాంటి సెలబ్రిటీలు తాము మద్యానికి దూరంగా ఉంటున్నామని ప్రకటించడం కూడా కుర్రాళ్లపై బాగా ప్రభావం చూపించింది. ఇక 'నో–ఆల్కహాల్' లేదా 'ఆల్కహాల్ ఫ్రీ' లైఫ్‌స్టైల్ వైపు యువత మొగ్గు చూపుతోంది.

**బరువు తగ్గే మందులు, ఇతర కారణాలు**

ఆరోగ్య సంస్థల హెచ్చరికల వల్ల కూడా జనాలు అలవాట్లు మార్చుకుంటున్నారు. దీనికి తోడు బరువు తగ్గే మందులు వాడుతున్న వారు కూడా మద్యానికి దూరంగా ఉంటున్నారు. అలాగే అమెరికా లాంటి దేశాల్లో గంజాయి ప్రత్యామ్నాయంగా మారడం, చైనాలో ప్రభుత్వ ఫంక్షన్లలో మద్యంపై నిషేధం విధించడం కూడా మార్కెట్‌ను దెబ్బతీశాయి.

# ఎబోలా పై కేంద్రం హై అలర్ట్

మొదటి తరువాయి

మార్గదర్శకాలను విడుదల చేసింది. ఎబోలా ప్రభావిత దేశాల నుంచి భారత్‌కు వచ్చే ప్రయాణికులు, ఇమ్మిగ్రేషన్ తనిఖీలకు ముందే ఆరోగ్య అధికారులను సంప్రదించాలని కోరింది. ముఖ్యంగా డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (డీఆర్‌సీ), ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాల నుంచి వచ్చే ప్రయాణికులు ఎబోలా లక్షణాలు కనిపిస్తే వెంటనే ఎయిర్‌పోర్ట్ ఆరోగ్య అధికారులకు సమాచారం ఇవ్వాలని స్పష్టం చేసింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ఇటీవల కాంగో, ఉగాండాలో వైరస్ వ్యాప్తిపై 'గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీ' ప్రకటించిన నేపథ్యంలో కేంద్రం ఈ చర్యలు చేపట్టింది. అయితే ఇది ప్రపంచవ్యాప్త మహమ్మారి కాదని డబ్ల్యూహెచ్‌ఓ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అథనామ్ గెబ్రియేసస్ స్పష్టం చేశారు.

అడ్వైజరీలోని సూచనలు

కేంద్ర ఆరోగ్య శాఖ విడుదల చేసిన అడ్వైజరీ ప్రకారం, ఎబోలా ప్రభావిత దేశాల నుంచి భారత్‌కు చేరుకునే ప్రయాణికులు జ్వరం, తీవ్ర అలసట, నీరసం, తలనొప్పి, కండరాల నొప్పులు, వాంతులు, విరేచనాలు, గొంతు నొప్పి, శరీరంలో అనూహ్య రక్తస్రావం వంటి లక్షణాలు ఉంటే వెంటనే విమానాశ్రయంలోని ఆరోగ్య విభాగానికి సమాచారం ఇవ్వాలి. ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్‌కు ముందే తమ ఆరోగ్య పరిస్థితిని వెల్లడించాలని అధికారులు సూచిం చారు. అలాగే ఎబోలా అనుమానితులు లేదా నిర్ధారిత రోగుల రక్తం, శరీర ద్రవాలతో నేరుగా సంబంధం కలిగిన ప్రయాణికులు కూడా వెంటనే ఆరోగ్య అధికారులను సంప్రదించాలని డీజీహెచ్‌ఎస్ పేర్కొంది. ఇది ఇతర ప్రయాణికుల భద్రత దృష్ట్యా అత్యంత కీలకమని పేర్కొంది. అదేవిధంగా, భారత్‌కు వచ్చిన తర్వాత 21 రోజుల లోపు ఎవరైనా పైన చెప్పిన లక్షణాలతో బాధపడితే వెంటనే వైద్యులను సంప్రందించాలని, తమ ప్రయాణ చరిత్రను అధికారులకు వెల్లడించాలని సూచించింది.

# నిప్పులకొలిమి

మొదటి తరువాయి

పలుచోట్ల పదేండ్ల రికార్డులు దాటేసి

సూర్యుడి ఉగ్రరూపంతో పలుచోట్ల గత పదేండ్ల మే నెల రికార్డులు బద్దలయ్యాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2019 మే 24, 29, 30 తేదీల్లో అత్యధిక ఉష్ణోగ్రత రికార్డు 46.3 డిగ్రీలుండగా బుధవారం దానిని అధిగమించి దిలావర్‌పూర్‌లో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే హనుమకొండలో పదేండ్ల రికార్డు 2017 మే 22, 23 తేదీల్లో 45 డిగ్రీలుంటే తాజాగా 46.4 డిగ్రీలతో ఊహించని కొత్త రికార్డు నమోదైంది. కుమురం భీం ఆసిఫాబాద్, జనగామ జిల్లాల్లో తీవ్ర వడగాలులు, ఇతర జిల్లాల్లో వడగాలులు వీచినట్టు హైదరాబాద్ వాతావరణశాఖ తెలిపింది. రాష్ట్రంలో అత్యధికంగా నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో 46.5, హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలో 46.4, కరీంనగర్ జిల్లా చొప్పదండిలో 46.4 డిగ్రీల రికార్డు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 19 జిల్లాల్లో 46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవ్వడం కలవరపాటు పెడుతోంది. మొత్తం 33 జిల్లాల్లోనూ 40.5 డిగ్రీలకన్నా ఎక్కువగా ఉష్ణోగ్రతలు ఉన్నాయి. ఈ ఎండల ధాటికి జనం అల్లాడిపోతున్నారు. రైతులు, కూలీల పరిస్థితి మరింత దయనీ యంగా మారింది. వారికి పని స్థలాల్లో కనీస సౌకర్యాలు కల్పించకపోవటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక మూగజీవాల పరిస్థితి చెప్పనవసరం లేదు.

# దేశంలో కాక్రోచ్ ప్రకంపనలు!

మొదటి తరువాయి

దేశవ్యాప్తంగా లక్షలాది మంది కార్యకర్తలు ఉన్నట్టు చెప్పుకొనే జాతీయ పార్టీలకు కూడా ఇన్‌స్టాగ్రామ్‌లో ఇంతమంది ఫాలోవర్లు లేకపోవడం గమనార్హం. 141 ఏండ్ల కిందట ఏర్పడిన కాంగ్రెస్ పార్టీకి ఇన్‌స్టాలో 1.33 కోట్ల మంది ఫాలోవర్లు ఉండగా, 46 ఏండ్ల కిందట ఏర్పడిన బీజేపీకి 88 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు. అయితే, ప్రారంభించిన ఐదు రోజుల్లోనే సీజేపీ ఇన్‌స్టా పేజీకి 1.6 కోట్ల మంది ఫాలోవర్లు రావడం గమనార్హం.

**కాక్రోచ్ ఈజ్ బ్యాక్**

సోషల్‌మీడియాలో సంచలనాలను సృష్టిస్తున్న సీజేపీ ఎక్స్ ఖాతాను భారత్‌లో నిలిపేశారు. చట్టపరమైన డిమాండ్ పేరిట ఖాతాను నిలిపివేశారంటూ సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే, సీజేపీ ఎక్స్ ఖాతా నిలిపేసిన గంటల వ్యవధిలోనే ఆ డిజిటల్ అవుట్‌ఫిట్ నుంచి కొత్త ఖాతా క్రియేట్ అయ్యింది. 'కాక్రోచ్ ఈజ్ బ్యాక్' పేరిట ప్రారంభమైన ఈ ఖాతాను నిమిషాల వ్యవధిలో వేలాది మంది ఫాలో కావడం గమనార్హం. 'నిన్న మా ఎక్స్ ఖాతాను హ్యాక్ చేసే ప్రయత్నాలు జరిగాయి. ఇప్పుడు ఖాతాను నిలిపేశారు. ఇలాంటిది ఏదో ఒకటి జరుగుతుందని మేము ముందే ఊహించాం. అందుకే, 'కాక్రోచ్ ఈజ్ బ్యాక్' అనే ఖాతాతో మా ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాం. ప్రస్తుత పరిణామాలను న్యాయపరంగా పరిష్కరించుకొంటాం' అని అభిజీత్ వెల్లడించారు.తెలంగాణ సమాచారం

**ట్రేడ్ మార్క్ దరఖాస్తులు**

సీజేపీ పేరుపై హక్కులను కోరుతూ మూడు వేర్వేరు ట్రేడ్‌మార్క్ దరఖాస్తులు దాఖలయ్యాయి. అయితే, సీజేపీని స్థాపించిన అభిజీత్ కాకుండా వేర్వేరు వ్యక్తులు ఈ దరఖాస్తులను దాఖలు చేయడం గమనార్హం. అజీమ్ అడంభాయ్ జామ్, అఖండ్ స్వరూప్ అనే వ్యక్తులతో పాటు కాక్రోచ్ జనతా పార్టీ అనే యాజమాన్య సంస్థ వేర్వేరుగా సీజేపీ పేరు కోసం దరఖాస్తులు చేసినట్టు సమాచారం.

# పుల్వామా దాడి సూత్రధారి హతం..

**న్యూఢిల్లీ:**

2019 పుల్వామా దాడి సూత్రధారుల్లో ఒకరైన హమ్జా బుర్హాన్ హతమయ్యాడు. పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)లో అతడిని గుర్తు తెలియని వ్యక్తులు కాల్చిచంపారు. ముజఫరాబాద్‌లో ఈ ఘట న జరిగింది. పుల్వామాకు చెందిన బుర్హాన్ 2017లో ఉన్నత చదువుల నిమిత్తం పాక్ వెళ్లి అక్కడ నిషేధిత అల్–బద్ సంస్థలో చేరి కమాండర్ స్థాయికి ఎదిగాడు.ఆ తర్వాత కశ్మీర్ తిరిగి వచ్చి యువతలో ఉగ్రవాద బీజాలు నాటాడు. ఫిబ్రవరి 14, 2019లో 40 మంది సీఆర్‌పీఫ్ జవాన్ల సజీవ దహనానికి కారణమైన పుల్వామా దాడితో పాటు కశ్మీర్‌లో పలు ఉగ్రవాద కార్యకలాపాల్లో అతడి ప్రమేయం ఉన్నది.

# కార్మికులకు ప్రభుత్వం శుభవార్త

మొదటి తరువాయి

విక్రమార్క ఆధ్వర్యంలో కేబినెట్ సబ్ కమిటీని నియమించామని అన్నారు. సబ్ కమిటీ నివేదించిన అంశాలపై చర్చించి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం తరఫున శుభాకాంక్షలు. కార్మికులను నాలుగు కేటగిరీలుగా చేశాం. అన్‌స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హైలీ స్కిల్డ్‌గా విభజించాం. వర్క్ జోన్లను మూడు భాగాలుగా విభజించాం. జోన్–1లో మున్సిపల్ కార్పొరేషన్స్, జోన్–2లో మున్సిపాలిటీలు, జోన్–3లో గ్రామీణ ప్రాంతాలను తీసుకుని కనీసవేతనం నిర్ణయించాం అన్నారు. అన్‌స్కిల్డ్ కేటగిరీలో కనీస వేతనాన్ని రూ.12,750 నుంచి రూ.16 వేలకు పెంచాం. సెమీ స్కిల్డ్ కేటగిరీలో రూ.13,152 నుంచి రూ.17 వేలకు.. స్కిల్డ్ కేటగిరీలో రూ.13,772 నుంచి రూ.18,500కు పెంచాం. హైలీ స్కిల్డ్ కేటగిరీలో రూ.14,607 నుంచి రూ.20 వేలకు పెంచాం. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో 1.11 కోట్ల మంది కార్మికులకు మేలు జరుగుతుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం జూన్ 1, 2026 నుంచి అమలవుతుంద

ని అన్నారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మొదటిసారిగా కార్మికుల సంక్షేమం కోసం తీసుకున్న నిర్ణయం ఇది. గత ప్రభుత్వం తన బాధ్యతను వదిలేసింది. మా ప్రభుత్వం బాధ్యతతో వారి ప్రయోజనం కోసం నిర్ణయం తీసుకుంది. కార్మిక నాయకుడంటే వెంకటస్వామి గుర్తొస్తారు. ఆయన వారసుడిగా మంత్రి వివేక్ వెంకటస్వామి.. కార్మికుల



సంక్షేమం కోసం మంచి నిర్ణయం తీసుకున్నారు. యువతకు నేను ఒకటే సూచన చేస్తున్నా. ఐటీ, అమెరికా అనే ఆలోచనను వీడండి. ఉద్యోగాలు రాని, ఉపాధి అవకాశాలు లేని చదువులు వ్యర్థం. సాంకేతిక నైపుణ్యంతో జర్మనీ, జపాన్, సింగపూర్ లాంటి ఇతర దేశాల్లో అనేక అవకాశాలు ఉన్నాయి. అందుకే రాష్ట్ర ప్రభుత్వం స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి యువతను ప్రోత్సహిస్తోంది. ఆ దిశగా యువత దృష్టి సారించాలని సూచించారు. ప్రజా సమస్యలను, దేశాల మధ్య యుద్ధాన్ని బీజేపీ, ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం రాజకీయ కోణంలో చూస్తోంది. అందుకే ఎన్నికలు అయిపోగానే పెట్రోల్, డీజిల్ ధరలను రోజుకోసారి పెంచుతున్నారు. మా ప్రభుత్వం ప్రతి అంశాన్నీ దీర్ఘకాలిక దృష్టితో చూస్తుంది. అందుకే కార్మికుల కనీస వేతనం పెంపుపై నిర్ణయం తీసుకున్నాం. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ 80 శాతం పూర్తయింది. ఇంకా 20 శాతం మిగిలి ఉంది. ఆ ప్రక్రియ కూడా త్వరలోనే పూర్తి చేస్తాం. బీఆర్ఎస్ నేతలు మానవత్వం మరిచిపోయి వ్యవహరిస్తున్నారు. రైతుల విషయంలో శవ రాజకీయాలు చేయాలని చూస్తున్నారు. రాజకీయాల కోసం మరీ ఇంత దిగజారి వ్యవహరిస్తారా?. నిజంగా రైతులపై ప్రతిపక్షాలకు చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. పోక్సో కేసులో బండి భగీరథ్‌ను పోలీసులే అరెస్ట్ చేశారని స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ తన కుమారుడిని అప్పగించి ఉంటే తమ ఇంట్లోనే అప్పగించి ఉండేవారు. పోక్సో కేసులో ఏదో సాధించినట్లు బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారు. రాజకీయాలు చేయాలనుకుంటే ఎన్నికల్లో ఓడించాలి.. అంతేకాని దిగజారి ప్రవర్తించొద్దు. కేటీఆర్ బావమరిది ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ దొరికినా నోటీసు ఇచ్చి విచారించాం. బండి భగీరథ్ విషయంలోనూ నోటీసులు ఇచ్చి విచారణ చేస్తున్నాం. పోక్సో కేసులో పోలీసులు ప్రొసీజర్ ప్రకారమే వ్యవహరిస్తున్నారు. కేటీఆర్ ఇంకా కల్వకుంట రాజ్యాంగంలోనే ఉన్నానని అనుకుంటున్నారని అంటూ ఎద్దేవా చేశారు. కేసీఆర్ దిగిపోయి చాలా రోజులు అయ్యింది. పార్టీ మీటింగ్ కోసం జగిత్యాలకు వెళ్లిన కేసీఆర్.. రాష్ట్రంలో ఇంత పెద్ద సంఘటన జరిగితే ఎందుకు బయటకు రాలేదు?. కులగణన విషయంలో సుప్రీంకోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. తెలంగాణ నిర్ణయాన్ని ఉన్నత న్యాయస్థానం సమర్థించడం మాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాం. తెలంగాణలో జనగణనతో పాటు కులగణన చేసి అన్ని వివరాలు ప్రజల ముందుంచాం. 'జనగణనలో కులగణన' విషయంలో తెలంగాణ దేశానికి దిక్సూచిగా నిలిచింది. మోదీ ప్రభుత్వం తక్షణమే జనగణనలో కులగణన చేర్చి బలహీన వర్గాలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించాలి' అని అన్నారు.

# పంటల కొనుగోలుపై ఎన్నాళ్లీ మొద్దునిద్ర?

మొదటి తరువాయి

రైతులే రేపు కీలెరిగి వాతలు పెడుతారని హెచ్చరించారు. వడ్ల కొనుగోలుకు కాంటా పెట్టని కాంగ్రెస్ సర్కార్‌కు రైతన్న చేతిలోనే కౌంట్‌డౌన్ మొదలైందని స్పష్టంచేశారు.తెలంగాణ సమాచారం

అరాచక పాలనకు ఆనవాళ్లు

తొమ్మిదిన్నరేండ్ల కేసీఆర్ పాలనలో కొం డంత ధైర్యంతో బతికిన అన్నదాత.. కాంగ్రెస్ రెండున్నరేండ్ల పాలనలో ఆత్మవిశ్వాసం కోల్పోయి రోడ్డున పడ్డాడని సీఎంకు రాసిన లేఖలో కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. ఆరు దశాబ్దాల కష్టాలు శాశ్వతంగా తీరిపోయానని సంబురంగా సాగు చేసుకుంటున్న రైతన్నల నోట్లో కాంగ్రెస్ మట్టికొట్టిందని దుయ్యబట్టారు. రైతుకు రక్షణగా కేసీఆర్ అమలు చేసిన పథకాలకు రేవంత్ సర్కార్ పాతరేసి అన్నదాత వెన్ను విరిచిందని మండిపడ్డారు. కాంగ్రెస్ అరాచక పాలన ఆనవాళ్లు పరాకాష్టకు చేరాయని తూర్పారబట్టారు.

పెట్టుబడి సాయాన్ని నాలుగుసార్లు ఎగ్గొట్టినా, యూరియా కష్టాల పాల్జేసినా వాటిని అధిగమించి పంటలు పండిస్తే కొనుగోలు చేసే నాథుడే లేడని ధ్వజమెత్తారు. 'మీరు చేసిన ద్రోహంతోపాటు వడదెబ్బ బారిన పడి 10 మందికి పైగా రైతులు ప్రాణాలు విడిచారు. 30 నెలల్లో సమైక్య పాలనలోని పరిస్థితులను తెచ్చి రైతులను నిండాముంచారు. ఇన్నాళ్లు సంతోషంగా సాగిన సాగును కన్నీటి సేద్యంగా మార్చారు. రైతుల కన్నీళ్లతో ఖాళీగా ఉన్న రిజర్వాయర్లు నిండేలా ఉన్నాయి' అని పేర్కొన్నారు. 'చివరికి మీ సొంత నియోజకవర్గమైన కొడంగల్ రైతులు సైతం రోడ్డెక్కి దుమ్మెత్తిపోసే దుస్థితి వచ్చిందంటే సంక్షోభంలో చిక్కుకున్న సాగు పరిస్థితికి అద్దంపడుతుంది' అని స్పష్టంచేశారు.

**ముక్కునేలకు రాసి క్షమాపణలు చెప్పండి**

వరంగల్ నుంచి ఖమ్మందాకా కొనుగోలు కేంద్రాల్లో ఒక్క లారీ లోడ్ కూడా ఎత్తడం లేదని కేటీఆర్ పేర్కొన్నా రు. 'కొనుగోలు చేసిన పంటలోనూ క్వింటాకు 10 కిలోలకు పైగా తరుగు పెడితే రైతుకు మిగిలేదేంటో చెప్పాలి.. గన్నీ బ్యాగుకు రూ.50 డిపాజిట్ చేయాల్సి రావడం సిగ్గుచేటని తె లిపారు. 'బోనస్ ఇచ్చే ముఖం మీ సర్కార్‌కు ఎలాగూ లేదు.. కనీసం వడ్లను సైతం కొనుడు చేతగాకుంటే ముక్కునేలకు రాసి 60లక్షల మంది రైతులకు క్షమాపణ చెప్పా లి' అని డిమాండ్ చేశారు. రైతులు గోసప డుతుంటే పర్యాటక వారోత్సవాలు జరుపుకోవడం బాధాకరమని మండిపడ్డారు. రేవంత్ చేసిన సాగుద్రోహానికి ఇప్పటివరకూ వెయ్యి మందికిపైగా రైతులు బలైపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. కేంద్రాల్లో చనిపోయిన రైతుల కుటుంబాలకు రూ.25లక్షల చొప్పున పరిహారం అందజేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# విజయ్ తొలి మంత్రివర్గ విస్తరణ

మొదటి తరువాయి

దీనిపై గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ సీరియస్ అయ్యారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజేష్ కుమార్, విశ్వనాథన్‌లకు విజయ్ క్యాబినెట్‌లో చోటు దక్కింది. కుమార్ వేదికపై ప్రమాణపత్రాన్ని చదువుతూ.. తన ప్రమాణస్వీకారాన్ని ముగించారు. ఆ తరువాత కాంగ్రెస్ నాయకులు రాజీవ్ గాంధీ, కామరాజ్ (తమిళనాడు దివంగత నేత), రాహుల్ గాంధీ ల పేర్లను ప్రస్తావించారు. దీనిపై గవర్నర్ సీరియస్‌గా స్పందించారు. 'అది మీ ప్రమాణంలో భాగం కాదు' అంటూ మందలించారు. అనంతరం రాజేష్ కుమార్ తన ప్రమాణపత్రంపై సంతకం చేసి అక్కడినుంచి వెళ్లిపోయారు. ప్రస్తుతం ఈ సంఘటన చర్చనీయాంశంగా మారింది.

పాటపై మరో వివాదం..

ఈ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ముందు రాష్ట్ర గీతాన్ని చివరిలో ఆలపించడం పైనా వివాదం చెలరేగింది. కార్యక్రమంలో వందేమాతరం, జాతీయగీతం తర్వాత తమిళ గీతాన్ని ఆలపించడంపై వామపక్ష పార్టీలు అభ్యంతరం తెలిపాయి. దీనిపై సీపీఐ కార్యదర్శి ఎం.వీరపాండియన్ విలేకరులతో మాట్లాడుతూ.. తమిళనాడు గవర్నర్ రాష్ట్ర గీతానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. జాతీయగీతాన్ని తాము గౌరవిస్తున్నామని స్పష్టం చేశారు. అయితే, ఈ వివాదంపై సీఎం విజయ్ దగ్గర తాము ప్రస్తావించామని సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి పి.షణ్ముగం తెలిపారు. గవర్నర్ పాల్గొనే అన్ని కార్యక్రమాల్లోనూ మొదట వందేమాతరమే ఆలపిస్తారని సీఎం స్పష్టం చేసినట్లు వెల్లడించారు. కాగా.. సీఎంగా విజయ్ ప్రమాణస్వీకారం చేసిన రోజు కూడా ఇదే విషయంపై వివాదం తలెత్తింది. ఇక, కొత్తగా ఏర్పడిన తమిళనాడు ప్రభుత్వంలోకి టీవీకేకు చెందిన 21 మంది, కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు సహా మొత్తం 23 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు.

# జూన్ 2 తర్వాత మద్యం ధరల బాదుడు!

**-తయారీ వ్యయం పెరగడమే**
**ధరల పెంపునకు ప్రధాన కారణం**
**-10 నుంచి 15 శాతం మేర పెంపునకు మొగ్గు చూపుతున్న ప్రభుత్వం**
**-అధికారిక ప్రకటన వెలువడే అవకాశం**



హైదరాబాద్ :

తెలంగాణలో మద్యం ప్రియులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం షాక్ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. రాష్ట్రంలో త్వరలోనే అన్ని రకాల మద్యం, బీర్ల ధరలు పెరగనున్నాయి. రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2 తర్వాత ధరల పెంపుపై అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నాయని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ నిర్ణయం ద్వారా రాష్ట్ర ఖజానాకు అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గత కొంతకాలంగా మద్యం తయారీ కంపెనీల నుంచి ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి వస్తోంది. ముడిసరుకుల ధరలు, ముఖ్యంగా సీసాల తయారీ ఖర్చు పెరగడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. పశ్చిమాసియా యుద్ధం, కమర్షియల్ గ్యాస్ ధరలు రెట్టింపు కావడం వంటి కారణాలతో సీసాల తయారీ వ్యయం 15 నుంచి 20 శాతం వరకు పెరిగిందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ధరలను సవరించాలని కంపెనీలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. మద్యం ధరల పెంపు, ఆదాయ వనరులపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం గతంలోనే ఓ త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. ప్రస్తుత మార్కెట్ పరిస్థితులు, పొరుగు రాష్ట్రాల్లోని ధరలను విశ్లేషించిన ఈ కమిటీ రాష్ట్రంలో 25 నుంచి 30 శాతం వరకు ధరలు పెంచవచ్చని ప్రభుత్వానికి సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. అయితే, ఒకేసారి ఇంత భారీగా పెంచితే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందన్న ఆలోచనతో ప్రభుత్వం సుమారు 10 నుంచి 15 శాతం మేరకే పెంపునకు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. ఈ పెంపు నిర్ణయం అమలైతే సాధారణ, మీడియం బ్రాండ్లతో పాటు ప్రీమియం బ్రాండ్ల ధరలు కూడా పెరగనున్నాయి. పెరిగిన ధరల ద్వారా ప్రభుత్వానికి అదనపు ఆదాయం లభించనుండగా, మద్యం ప్రియులపై మాత్రం భారం పడనుంది. ఆర్థిక, అబ్కారీ శాఖలు దీనికి సంబంధించిన కసరత్తును ఇప్పటికే పూర్తి చేసినట్లు తెలుస్తోంది.

# కాళేశ్వరంలో సరస్వతీ అంత్య పుష్కరాలు ప్రారంభం..

చేశారు. తెలంగాణలో తొలిసారిగా జరుగుతున్న ఈ పుష్కరాలకు భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. గోదావరి, ప్రాణహిత నదులతో పాటు అంతర్వాహినిగా ప్రవహించే సరస్వతి నది కలిసే పవిత్ర త్రివేణి సంగమ క్షేత్రమే కాళేశ్వరం. దేశంలో ప్రయాగ్‌రాజ్ తర్వాత ఇలాంటి త్రివేణి సంగమం ఉన్న రెండో ప్రదేశం ఇదే. ఇక్కడ స్నానం ఆచరిస్తే పాపాలు తొలగిపోయి, పునర్జన్మ నుంచి విముక్తి లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ 12 రోజుల పుష్కరాలకు తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి సుమారు 20 నుంచి 30 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. పుష్కరాలను భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించిన నేపథ్యంలో ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా భద్రత, పారిశుధ్యం, తాగునీరు, వైద్య సేవలు, రవాణా సౌకర్యాలు కల్పించినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఎండల తీవ్రత దృష్ట్యా భక్తులు ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమాల్లో పలువురు ఎమ్మెల్యేలు, దేవాదాయ శాఖ అధికారులు కూడా పాల్గొన్నారు

# పాక్ నుంచే పహల్గాం దాడి కుట్ర

న్యూఢిల్లీ:

జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో 2025 ఏప్రిల్‌లో జరిగిన ఘోర ఉగ్రదాడిపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. పాకిస్తాన్ కేంద్రంగా నడిచిన భారీ కుట్ర వెలుగులోకి వచ్చింది. లష్కరే తొయిబా అనుబంధ సంస్థ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' (టిఆర్ఎఫ్) హ్యాండ్లర్లు పాకిస్తాన్ నుంచి ఈ దాడిని నడిపినట్లు ఎన్ఐఏ పేర్కొంది. అలాగే 'ఫాల్స్ ఫ్లాగ్' ప్రచారాన్ని కూడా పాక్ నుంచే నడిపినట్లు ఎన్ఐఏ వెల్లడించింది.

పాక్ ఐపీ అడ్రస్ల గుర్తింపు– 'ఫాల్స్ ఫ్లాగ్' ప్రచారం బట్టబయలు

ది రెసిస్టెన్స్ ఫ్రంట్ హ్యాండ్లర్లు పాక్ నుంచి ఈ ఉగ్రదాడికి వ్యూహ రచన చేసినట్లు ఎన్ఐఏ తెలిపింది. దాడి జరిగిన వెంటనే 'కశ్మీర్ ఫైట్' అనే టెలిగ్రామ్ ఛానల్ ద్వారా 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' బాధ్యత స్వీకరించినట్లు ఎన్ఐఏ పేర్కొంది. అయితే అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర విమర్శలు రావడం, ఐరాస భద్రతామండలి దాడిని ఖండించడంతో టీఆర్ఎఫ్ వెనక్కి తగ్గి తమ ఛానల్ హ్యాక్ అయిందని చెప్పినట్లు వెల్లడించింది. ఎన్ఐఏ సాంకేతిక దర్యాప్తులో 'కశ్మీర్ ఫైట్' ఛానల్ పాకిస్తాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా రాష్ట్రంలోని బట్టగ్రామ్ ప్రాంతం నుంచి నడిచినట్లు తెలిసింది. 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్ – అఫీషియల్' అనే మరో ఛానల్ రావల్పిండి నుంచి నిర్వహించినట్లు గుర్తించింది. దాడిని భారత్ చేసిందన్న తప్పుడు ప్రచారాన్ని ప్రపంచాన్ని తప్పుదారి పట్టించేందుకు పాక్ ప్రణాళికాబద్ధంగా నడిపించిందని ఎన్ఐఏ పేర్కొంది.

# జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు

-సొసైటీ చైర్మన్ సాయికుమార్



**గాంధారి, మే 21 (మహాప్రభ)**
కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు గాంధారి మండలంలో సహకార సంఘం ఆవరణలో ఏర్పాటు చేసిన జొన్న కోనుగులు కేంద్రాన్ని సోసైటీ ఛైర్మన్ సాయికుమార్, ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. జొన్నలను దళారులకు విక్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. క్వింటాకు ప్రభుత్వం మద్దతు ధర రూ.3,699 ఉందన్నారు. రైతులు పండించిన జొన్న కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ప్రభుత్వ మండల అధికారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.


# నర్సాపూర్ నియోజకవర్గంలో ఆవుల రాజిరెడ్డి విస్తృత పర్యటన





**శివంపేట మే 21(మహాప్రభ):**
నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా హత్నూర మండలం దౌల్తాబాద్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ దేశ అభివృద్ధికి చేసిన సేవలను గుర్తు చేశారు. అనంతరం నర్సాపురం మండలం లింగాపూర్ గ్రామంలోని జగ్గ తండాలో నిర్వహించిన సంతు సేవాలాల్ మహారాజ్ ఆలయ వార్షికోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. తదుపరి వెల్దుర్తి మండలం రామయపల్లి గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన ఈరుంటి యశోద గారి అంతిమయాత్రలో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# విఓఏ ల సమస్యల గురించి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ కు వినతిపత్రం సమర్పణ.



**మెదక్ జిల్లా -21మే (మహాప్రభ ).**
వి ఏ ఓ సమస్యల గురించి గురువారం కలెక్టరేట్‌లో నిరసన తెలిపారు. వీఓఏలు అదనపు కలెక్టర్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం రాజేశ్వరీ మాట్లాడుతూ వీఓఏల కనీస వేతనం రూ.20వేలు ఇవ్వాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీ వర్తింపజేయాలన్నారు. అలాగే అర్హులైన వీఓఏలకు సీసీలలకు పదోన్నతులుగా కల్పించాలని, వీఓఏలకు స్యాధారణ, ఆరోగ్య భీమా కల్పించాలన్నారు. అలాగే ట్యాబ్ సౌకర్యం కల్పిస్తూ జీఓ నెం.58ను సవరించాలన్నారు. డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈనెల 18 నుండి సమ్మె కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు అదనపు కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి అశోక్ యాదవ్, కోశాధికారి అనిత, ఉపాధ్యక్షుడు సురేష్, సహకార్యదర్శి లక్ష్మి తోపాటు పెద్ద ఎత్తున వీఓఏలు పాల్గొన్నారు.

# పిల్లుట్లలో వరి కోయలకు నిప్పు.. గ్రామస్తుల్లో భయాందోళన



**శివంపేట మే 21 (మహాప్రభ):**
మెదక్ జిల్లా శివంపేట మండలం పిల్లుట్ల గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు వరి కోయలకు నిప్పు పెట్టడంతో భారీగా మంటలు చెలరేగాయి. గాలికి మంటలు వేగంగా వ్యాపించడంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఫైర్ ఇంజన్‌తో ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్రమత్తమైన స్థానికులు కూడా అగ్నిమాపక సిబ్బందికి సహకరించారు. ఈ ఘటనలో రైతులకు స్వల్ప నష్టం వాటిల్లినట్లు సమాచారం. మంటలు ఎలా చెలరేగాయన్న దానిపై అధికారులు ఆరా తీస్తున్నారు.

# రీల్స్‌తో మెదక్ పర్యాటక అందాలను విశ్వవ్యాప్తం చేయాలి.

**-లోకల్ టు గ్లోబల్‌గా మెదక్ జిల్లా ఘన కీర్తిని ప్రపంచానికి తెలియజేయాలి.**
**-టూరిస్ట్ గైడ్ కోసం దరఖాస్తుల సమర్పించాలి.**
**--జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**

**మెదక్ జిల్లా -21మే (మహాప్రభ ).**
ఇన్‌ఫ్లుయెన్సర్లు రీల్స్‌తో మెదక్.జిల్లా పర్యాటక అందాలను విశ్వవ్యాప్తం చేయాలని, లోకల్ టు గ్లోబల్‌గా మెదక్ జిల్లా ఘన కీర్తిని ప్రపంచానికి పరిచయం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపునిచ్చారు. గురువారం మెదక్ జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో 'ఇన్‌ఫ్లుయెన్సర్ రీల్స్ కాంపిటీషన్'పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మెదక్ జిల్లా టూరిజంను ప్రపంచానికి పరిచయం చేసేందుకు నిర్వహిస్తున్న ఈ కాంపిటీషన్‌పై ఇన్‌ఫ్లుయెన్సర్లు, మీడియా ప్రతినిధులు, సోషల్ మీడియా హ్యాండ్లర్లతో జిల్లా కలెక్టర్ ముఖాముఖి చర్చించారు. రీల్స్ కాంపిటీషన్ విధివిధానాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ, బహుమతుల వివరాలు తదితర అంశాలను వారికి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పర్యాటక వారోత్సవాలలో భాగంగా మొదటిసారిగా వినూత్న పద్ధతిలో మెదక్ జిల్లాలోని అనేక పర్యాటక ప్రాంతాలకు బ్రాండింగ్ కలిగించే విధంగా 'ఇన్‌ఫ్లుయెన్సర్ రీల్స్ కాంపిటీషన్' నిర్వహించడం జరుగుతుందని స్పష్టం చేశారు.
మెదక్ జిల్లా పర్యాటక ప్రాంతాలపై 4ఖ వీడియో



క్వాలిటీతో రీల్స్ సమర్పించాల్సి ఉంటుందని, ఆసక్తి కలవారు తమ వీడియోలను మే 21వ తేదీ నుంచి మే 30వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో సమర్పించవచ్చని, ఆన్‌లైన్ విధానంలో డీపీఆర్ఓ Raju 9949922291, ఏపీఆర్ఓ బాబు 9701306838 నంబర్లకు వాట్సాప్ ద్వారా పంపించవచ్చని పేర్కొన్నారు. పోటీలలో గెలుపొందిన వారికి జూన్ 2వ తేదీన నగదు ప్రోత్సాహకాలు అందించబడుతుందన్నారు. మెదక్ జిల్లాలో ఆధ్యాత్మిక దేవాలయాలు, ప్రకృతి పర్యాటక కేంద్రాలు, జలపాతాలు, అభయారణ్య అందాలు, గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు కలగలిసి అనేక పర్యాటక ప్రాంతాలు ప్రకృతి వైవిధ్యభరితంగా నెలవై ఉన్నాయని పేర్కొన్నారు. జూన్ మాసం నుంచి పర్యాటక ప్రాంతాలకు ఎక్కువ సంఖ్యలో పర్యాటకులు వచ్చే అవకాశం ఉంటుందని, వారందరికీ మెదక్ జిల్లా సాదర ఆహ్వానం పలుకుతుందన్నారు. రీల్స్ కాంపిటీషన్ ద్వారా మెదక్ జిల్లా పర్యాటక ప్రాంతాలకు మంచి బ్రాండింగ్ వచ్చే విధంగా పూర్తి వివరాలతో, పర్యాటకులను ఆకట్టుకునే విధంగా రీల్స్‌ను రూపొందించాలన్నారు. పర్యాటక దినోత్సవ టూరిస్ట్ గైడ్ పోస్టర్ను ఆవిష్కరించారు. టూరిస్ట్ గైడ్ కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు అట్టి దరఖాస్తులను నిబంధనలు మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, ప్రొఫెసర్ అర్జున్ రావు కుతాడి, డైరెక్టర్, పురావస్తు మరియు మ్యూజియంల విభాగం డా. పి. నాగరాజు డిప్యూటీ డైరెక్టర్ (మ్యూజియంలు) ఎన్. నరసింగ్, డిప్యూటీ డైరెక్టర్ (ఇంజనీరింగ్) డి పి ఆర్ ఓ రామచంద్ర రాజు, యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్, పాత్రికేయులు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, యూట్యూబర్స్ తదితరులు పాల్గొన్నారు.

# పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

**-ఫాస్ట్‌ట్రాక్ కోర్టు సంచలన తీర్పు**
**- రూ.లక్ష జరిమానా విధింపు**

**కామారెడ్డి, మే 21 (మహాప్రభ)**
మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి కామారెడ్డి ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. అదేవిధంగా రూ.లక్ష జరిమానా కూడా విధిస్తూ తీర్పు వెలువరించింది. తాడ్వాయి పోలీసులు పకడ్బందీగా దర్యాప్తు చేసి, బలమైన సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టడంతో నేరం రుజువైంది. పోలీసుల వివరాల ప్రకారం.. తాడ్వాయి గ్రామానికి చెందిన మహమ్మద్ అబ్దుల్ రహీం(20) ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. టెంట్ హౌస్ వద్దకు తరచూ వచ్చే పదో తరగతి చదువుతున్న మైనర్ బాలికతో పరిచయం పెంచుకున్నాడు. ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి, పెళ్లి చేసుకుంటానని నమ్మబలికాడు. బాలిక మైనర్‌నని చెప్పినా వినకుండా వేధింపులకు పాల్పడ్డాడు. 2022 ఆగస్టు 5న స్కూల్‌కు వెళ్తున్న సమయంలో బాలికను



మాయమాటలతో కామారెడ్డి రైల్వే స్టేషన్‌కు తీసుకెళ్లి అక్కడి నుంచి ఢిల్లీకి తరలించాడు. అక్కడ వివిధ ప్రాంతాల్లో ఉంచి లైంగికంగా వేధించాడు. అదే రోజు బాలిక ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టారు. స్కూల్‌కు వెళ్లలేదని తెలుసుకుని తాడ్వాయి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసును అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్న పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపట్టి ఢిల్లీలో బాలికను గుర్తించి సురక్షితంగా రక్షించారు. బాధితురాలి వాంగ్మూలం ఆధారంగా పోక్సో, ఎస్సీ/ఎస్టీ చట్టాల కింద కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. కేసులో వైద్య నివేదికలు, సాక్ష్యాధారాలు, వాంగ్మూలాలను పరిశీలించిన ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ చి.వి.వి.ఆర్ వరప్రసాద్ నిందితుడిపై అభియోగాలు రుజువయ్యాయని తేల్చారు. దీంతో అతడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధించారు. ఈ కేసులో సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించిన అప్పటి డీఎస్పీ ఏ.శ్రీనివాసులు, ప్రస్తుత డీఎస్పీ ఎస్.శ్రీనివాస్‌రావు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు కె.శేషు, సూర్యప్రసాద్, ప్రస్తుత ఎస్‌హెచ్‌వో వై.నరేష్, కోర్టు లైజనింగ్ అధికారి ఏఎస్ఐ రామేశ్వర్‌రెడ్డి, కోర్టు కానిస్టేబుల్ టి.సాయిబాబులను జిల్లా ఎస్పీ ఎం.రాజేష్ చంద్ర అభినందించారు. "చిన్నారులపై దారుణాలకు తావులేదు.. చట్టం ముందు ఎవరూ తప్పించుకోలేరు" అని ఎస్పీ స్పష్టం చేశారు.

# మెదక్ కోట పునరుద్ధరణకు రూ.10 కోట్లతో పటిష్ట చర్యలు

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**మెదక్ జిల్లా -21మే (మహాప్రభ )**
గురువారం కలెక్టర్ ఛాంబర్ లో మెదక్ కోట పునరుద్ధరణ, పరిరక్షణపై చర్చించేందుకు పురావస్తు శాఖ డైరెక్టర్ సంబంధిత అధికారులతో గురువారం కలెక్టర్ సమావేశం అయ్యారు.ఈ సమావేశంలో ప్రొఫెసర్ అర్జున్ రావు, డాక్టర్ నాగరాజు, డిప్యూటీ డైరెక్టర్, శ్రీ ఎన్. నరసింగ్, డిప్యూటీ డైరెక్టర్ (ఇంజనీరింగ్), డిపిఆర్ఓ రామచంద్ర రాజు, యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్, ఈడియం సందీప్ పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కోట వద్ద పరిరక్షణ, పర్యాటక అభివృద్ధి మరియు మౌలిక సదుపాయాల మెరుగుదల పనులకు సంబంధించిన వివిధ అంశాలపై పురావస్తు శాఖ అధికారులతో చర్చించడం జరిగిందని తెలిపారు.మెదక్ కోట చారిత్రాత్మకంగా ప్రాముఖ్యత కలిగిన ఒక కొండ కోట. దీనిని మొదట 12-13వ శతాబ్దాలలో కాకతీయ కాలంలో నిర్మించగా, తదనంతరం కుతుబ్ షాహీ పాలకులు దీనిని మరింత పటిష్టం చేశారు. ఈ కోట దాని వ్యూహాత్మక ప్రదేశం, ప్రాచీన ద్వారాలు, ఫిరంగి స్థావరాలు, వాస్తు నిర్మాణ అవశేషాలు మరియు మెదక్



పట్టణం యొక్క విశాల దృశ్యానికి ప్రసిద్ధి చెందింది. ఇది తెలంగాణ యొక్క గొప్ప సాంస్కృతిక మరియు సైనిక చరిత్రను ప్రతిబింబించే ముఖ్యమైన వారసత్వ కట్టడాలలో ఒకటి. సమగ్ర అభివృద్ధి పనుల కోసం గతంలో ప్రతిపాదించిన 6.20 కోట్ల అంచనాను ఇప్పుడు సుమారు ?10 కోట్లకు సవరించినట్లు తెలిపారు.మెదక్ కోట సమగ్ర అభివృద్ధి కోసం మాస్టర్ ప్లాన్ తయారీకి ఒక కన్సల్టెంట్‌ను నియమించాల్సిన ఆవశ్యకతను సమావేశం నిర్ణయించిందన్నారు. మెదక్ కోట యొక్క మొత్తం అభివృద్ధి కార్యక్రమాన్ని ఈ క్రింది మూడు వర్గాలుగా విభజించాలని పరిరక్షణ పనులు, ఆదాయ సృష్టి అంశాలు, భూదృశ్య అభివృద్ధి పనులు. సవరించిన అంచనాల తయారీ మరియు కోట వద్ద మార్గాలు, లైటింగ్, తాగునీటి సౌకర్యాలు, కూర్చునే ఏర్పాట్లు, సూచికలు మరియు పారిశుధ్య సౌకర్యాలతో సహా సందర్శకుల సౌకర్యాల కల్పనపై చర్చించడం జరిగిందని తెలిపారు. మెరుగైన సందర్శకుల నిర్వహణ, వారసత్వ వివరణ, భద్రత మరియు పర్యాటక ప్రోత్సాహం కోసం టూరిస్ట్ గైడ్‌లు మరియు టూరిస్ట్ పోలీసులను నియమించాల్సిన సంవత్సరానికి అనుగుణంగా చర్యలు చేపడతామన్నారు. పురావస్తు శాఖ. సైంటిస్ట్ అర్జున్ రావు మెదక్‌ను ఒక ప్రధాన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి, దాని అభివృద్ధిని గుర్తించి, ప్రణాళిక రూపొందించేందుకు గాను, పురావస్తు శాఖ డైరెక్టర్‌ను మరియు పర్యాటక శాఖ డైరెక్టర్‌ను మెదక్ జిల్లాను సందర్శించవలసిందిగా మెదక్ కలెక్టర్ను అభ్యర్థించారు. మెదక్ కోట అభివృద్ధి, పరిరక్షణ కోసం వీలైనంత త్వరగా వివరణాత్మక అంచనాను సమర్పించాల్సిందిగా కలెక్టర్ పురావస్తు శాఖ డైరెక్టర్‌ను కోరారు.మెదక్ కోటను ఒక ప్రముఖ వారసత్వ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి, పరిరక్షించడానికి మరియు ప్రోత్సహించడానికి కార్పొరేట్ సామాజిక బాధ్యత (సి యస్ ఆర్ )నిధులను సమీకరించడంలో మద్దతు ఇస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శివంపేటలో పింఛన్ బయోమెట్రిక్ నమోదు డ్రైవ్

**శివంపేట మే 21 (మహాప్రభ):**
మెదక్ జిల్లా శివంపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో పింఛన్ లబ్ధిదారుల కోసం బయోమెట్రిక్ నమోదు కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి రమాదేవి ఆధ్వర్యంలో ఫింగర్ ప్రింట్, ఫేస్, ఐరిస్ నమోదు ప్రక్రియ చేపట్టారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడు బయోమెట్రిక్ విధానాలను తప్పనిసరి చేయడంతో గ్రామపంచాయతీ



కార్యాలయం వద్ద లబ్ధిదారుల భారీ రద్దీ నెలకొంది. వృద్ధులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై తమ వివరాలను నమోదు చేసుకున్నారు. సమయానికి బయోమెట్రిక్ నమోదు పూర్తి చేయించుకోని వారికి పింఛన్ నిలిచిపోయే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. దీంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తూ త్వరితగతిన నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని కోరుతున్నారు.

# మహిళల భద్రతకు పోలీసుల కట్టుదిట్టమైన చర్యలు

**-వేధింపులకు పాల్పడితే ఉపేక్షించం సీఐ మురళీకృష్ణ**




**మే 21 తిరుపతి జిల్లా (సూళ్లూరుపేట) మహాప్రభ**
సూళ్లూరుపేట, తడ పారిశ్రామిక ప్రాంతాల్లో మహిళల భద్రతకు పోలీసులు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని సూళ్లూరుపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం. మురళీకృష్ణ స్పష్టం చేశారు. రాత్రింబవళ్లు విధులు నిర్వహిస్తున్న వేలాది మంది మహిళా కార్మికుల రక్షణ కోసం నిరంతర నిఘా కొనసాగిస్తున్నామని తెలిపారు. మహిళలను వేధించే వారిపై కఠిన చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
స్థానిక విలేకరులతో మాట్లాడిన సీఐ మురళీకృష్ణ, మహిళల రక్షణ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. ప్రతి మహిళను ఇంటి ఆడబిడ్డలా గౌరవించాలని సమాజానికి పిలుపునిచ్చారు. మహిళలను ఇబ్బందులకు గురిచేసే చర్యలను పోలీసులు తీవ్రంగా పరిగణిస్తారని స్పష్టం చేశారు. పరిశ్రమల యాజమాన్యాలు అప్రమత్తంగా ఉండాలి రాత్రి షిఫ్టులు ముగించుకుని వెళ్లే మహిళా ఉద్యోగులకు పరిశ్రమల యాజమాన్యాలు సురక్షిత రవాణా సౌకర్యం కల్పించాలని సూచించారు. కంపెనీ వాహనాల డ్రైవర్ల పూర్తి వివరాలు, ఆధార్ సమాచారం, గత చరిత్రను పరిశీలించిన తర్వాతే విధుల్లోకి తీసుకోవాలని తెలిపారు. మహిళా ఉద్యోగుల భద్రత విషయంలో నిర్లక్ష్యం సహించబోమన్నారు. 'శక్తి' యాప్ ప్రతి మహిళకు రక్షణ కవచం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళల భద్రత కోసం తీసుకొచ్చిన "శక్తి" యాప్‌ను ప్రతి మహిళా ఉద్యోగి, విద్యార్థిని తప్పనిసరిగా తమ మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. ప్రమాద పరిస్థితుల్లో ఎస్‌ఓఎస్ బటన్ నొక్కినా లేదా ఫోన్‌ను గట్టిగా ఊపినా వెంటనే పోలీసులకు సమాచారం చేరుతుందని చెప్పారు. ఐదు నుంచి పది నిమిషాల్లోనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయం అందిస్తారని వివరించారు. సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ పరిశ్రమలు, వ్యాపార సంస్థలు, ప్రధాన కూడళ్లు, నివాస ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సీఐ సూచించారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. పారిశ్రామిక ప్రాంతాల్లో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులపై స్థానికులు అప్రమత్తంగా ఉండాలని, ఏ సమాచారం ఉన్నా వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. మహిళలను గౌరవించడం సమాజ బాధ్యత "పగలు, రాత్రి కష్టపడి పనిచేసే మహిళలను ఎవరూ ఇబ్బందులకు గురిచేయకూడదు. సమాజంలో ప్రతి మహిళను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత" అని సీఐ మురళీకృష్ణ పేర్కొన్నారు.
అత్యవసర సమయంలో సంప్రదించాల్సిన నంబర్లు
సూళ్లూరుపేట సీఐ ఎం. మురళీకృష్ణ -- 94407 96360
సూళ్లూరుపేట ఎస్సై జీ. అజయ్ కుమార్ -- 94407 96361
తడ ఎస్సై కొండప్పనాయుడు -- 94407 96362

# రైతులు చనిపోయినా పట్టించుకోని ప్రభుత్వం..

**-అన్ని కేంద్రాల్లో వెంటనే ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలి..**
**-ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి..**



**మెదక్ జిల్లా -21మే (మహాప్రభ ).**
రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ డిప్యూటీ స్పీకర్ యం . పద్మ దేవేందర్ రెడ్డి విమర్శించారు. శంకరంపేట్ మండలం అంబాజీపేట గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం మండల నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...ధాన్యం కొనుగోళ్లు ఆలస్యం కావడంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురైన రైతు రాజయ్య ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని మండిపడ్డారు. వడ్లు కొనుగోలు చేసి సమయానికి మిల్లులకు తరలించకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. లారీలు సమయానికి రాకపోవడంతో కొనుగోలు ప్రక్రియ నిలిచిపోతుందని, అధికారులు సరైన సమన్వయం చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. ముందుగానే ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించి ఉంటే రాజయ్య ప్రాణాలు నిలిచేవని అన్నారు. ధాన్యం డబ్బులు వస్తే రైతు అప్పులు తీర్చుకునేవాడని, రాజయ్య మృతికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. రైతులు రోడ్లెక్కి ధర్నాలు చేసినా ప్రభుత్వం స్పందించలేదని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి అన్ని కొనుగోలు కేంద్రాల్లో వెంటనే ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు కనీసం సమీక్ష సమావేశాలు నిర్వహించి ఎంత ధాన్యం కొనుగోలు అయింది, ఇంకా ఎంత నిల్వలో ఉంది, ఎన్ని లారీలు అవసరమో తెలుసుకోవడంలో కూడా విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులను ఆదుకునేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా కోరారు. వీరి వెంట శంకరంపేట్ మండల పార్టీ అధ్యక్షులు పట్లోరి. రాజు, గవ్వలపల్లి సర్పంచ్ సిద్ధిరాములు, మాజీ వైస్ ఎంపీపీ సత్య గౌడ్ మాజీ సర్పంచులు పోచయ్య దయానంద్ నాయకులు ప్రభాకర్ పడాల శ్రీనివాస్, మహేష్, కొమురయ్య, మల్లుపల్లి సర్పంచ్ నరేష్, రైతులు తదితరులు ఉన్నారు.

---

# సిపిఎస్ రిటైర్డ్ ఉద్యోగులకు ఈ హెచ్ ఎస్ అమలు చేయాలి



**పాపన్నపేట, మే 21.( మహాప్రభ )**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువస్తున్న నూతన ఎంప్లాయిస్ హెల్త్ స్కీం లో సిపిఎస్ రిటైర్డ్ ఉద్యోగులను మినహాయించడం హేయమైన చర్య అని తపస్ మెదక్ జిల్లా కార్యదర్శి మంగ నర్సింలు పేర్కొన్నారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులు మరియు పెన్షనర్ల కోసం ప్రతిపాదించిన నూతన ఎంప్లాయిస్ హెల్త్ స్కీం అమలులో సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం) రిటైర్డ్ ఉద్యోగుల పట్ల అవలంబిస్తున్న వివక్షను వ్యతిరేకించారు. ఉద్యోగంలో ఉన్నంత కాలం మూల వేతనం నుండి 1.5 శాతం నిధులను కట్ చేసుకుని క్యాష్‌లెస్ వైద్యం అందించి, రిటైర్ అయిన మరుక్షణమే హెల్త్ కార్డులు చెల్లవనడం ఏ రకమైన న్యాయం? అని ఆయన ప్రశ్నించారు. ఎవరికైనా వృద్ధాప్యంలోనే వైద్యం అత్యంత అవసరమన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, సీపీఎస్ రిటైర్డ్ ఉద్యోగులందరికీ నూతన హెల్త్ స్కీం కింద పూర్తి స్థాయి క్యాష్‌లెస్ వైద్యం అందేలా జీవోలో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు.

# దేవరకొండ పెన్షనర్స్ సంఘం అధ్యక్షులు 80వ పుట్టినరోజు, 60వ పెళ్లిరోజు వేడుకలు




**దేవరకొండ ( డివిజన్) 21మే మహాప్రభ:**
దేవరకొండ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యవర్గం సమావేశం గురువారం జరిగినది. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి అంకం చంద్రమౌళి మాట్లాడుతూ... జూన్ 2వ తేదీన విడుదల చేయునట్టి ఉద్యోగుల, రిటైర్డ్ ఉద్యోగుల హెల్త్ కార్డు గురించి ఇంకా సరిఅయిన స్పష్టత రాలేదని ఇంకా కొద్దిరోజులలో వివరాలు తెలుస్తాయి అన్నారు. అనంతరం అధ్యక్షులు తాడిశెట్టి నరసింహ గారి 80వ పుట్టినరోజు వేడుక సందర్భంగా సంఘం తరపున కార్యదర్శి అంకం చంద్రమౌళి, కోశాధికారి పంగునూరు లింగయ్య, సహ అధ్యక్షులు గంగిడి దామోదర్ రెడ్డి, ఉపాధ్యక్షురాలు పడమటి శాంతకుమారి జిల్లా కార్యదర్శి కంచర్ల నారాయణ రెడ్డి, సంయుక్త కార్యదర్శి వనం బుచ్చయ్య, ప్రచార కార్యదర్శి పగిడిమర్రి సత్యమూర్తి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేసినారు. అనంతరం అధ్యక్షులు నరసింహ దంపతులను సంఘం మహిళా సభ్యులు ఉపాధ్యక్షురాలు పడమటి శాంతకుమారి పూలమాలలతో అలంకరించి శాలువా కప్పి 60వ పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేసినారు. అనంతరం హాజరైన సభ్యులందరు దంపతులకు శుభాకాంక్షలు తెలిపి షాలువలు కప్పినారు. అనంతరం అధ్యక్షులువారు పసందైనా భోజనాలు ఏర్పాటు చేసినారు. స్వీట్స్ అందజేసినారు అందరికి కృతజ్ఞతలు తెలియజేసినారు.

# వైభవంగా పెద్దమ్మతల్లి పోచమ్మ తల్లి బోనాల పండుగ



**గాంధారి, మే 21 (మహాప్రభ)**
కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండల్ తిమ్మాజివాడి గ్రామంలో ఘనంగా పెద్దమ్మ తల్లి పోచమ్మ తల్లి కి బోనాలు సమర్పించారు ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామంలో అన్ని విధాలుగా పాడిపంట పిల్ల పాపలతో సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కొలుచుకున్నారు.
ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# 30 మంది కరాటే బ్లాక్ బెల్ట్‌లో విద్యార్థులు విజయకేతనం.




**మెదక్ జిల్లా -21మే (మహాప్రభ ).**
హైదరాబాదులో బోడుప్పల్లో జరిగిన కరాటే బ్లాక్ బెల్ట్ లో 30 మంది మెదక్ కి చెందిన కరాటే విద్యార్థులు విజయం సాధించారు. వీరంతా గత నాలుగు సంవత్సరాలుగా స్థానిక కరాటే మాస్టర్ దినకర్ వద్ద శిక్షణ పొందారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినిమా హీరో సుమన్ పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు వారి చేతుల మీదుగా బ్లాక్ బెల్ట్ సర్టిఫికెట్లు విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రేంజు కి షాటోకాన్ కరాటే వ్యవస్థాపక అధ్యక్షులు కరాటే మాస్టర్ నగేష్,అశోక్ మాస్టర్,నవీన్ మాస్టర్,నాగేంద్ర, కరాటే విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల పట్టు వస్త్రాలంకరణ వేడుకలో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు



**దేవరకొండ మే 21( మహాప్రభ )**
నియోజకవర్గంలోని గుడిపల్లి మండలంలో చిలక మర్రి కి చెందిన కోమల్ల గోపి - సైదమ్మ గార్ల కుమార్తె కుమారుడు శృతి - శివ లా పట్టు వస్త్రాలంకరణ వేడుకల్లో భాగంగా గురువారంకొండమల్లేపల్లి, చిలక మర్రి ప్రైమ్ కన్వెన్షన్ హాల్లో జరిగిన పట్టు వస్త్రాలంకరణ కార్యక్రమంలో పాల్గొని, చిన్నారులను ఆశీర్వదించిన బి ఆర్ ఎస్ బి దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్,వారితో పాటు దేవరకొండ మాజీ శాసన సభ్యులు రామావత్ రవీంద్ర కుమార్ రాష్ట నాయకులు బిల్యా నాయక్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ మాజీ మండల అధ్యక్షుడు వల్లబ్ రెడ్డి,పరమేశ్ ,భాస్కర్ ,కోటేష్ ,రవి, తదితరులు పాల్గొన్నారు...

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మ దేవేందర్ రెడ్డి.



**మెదక్ జిల్లా -21మే (మహాప్రభ )**
పాపంపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన దుర్గా దాస్ కుమారుడు వంకిడి. దుర్గాదాస్ కుమారిడి వివాహం కొత్తపల్లి అనంత పద్మనాభ స్వామి ఫంక్షన్ హల్ లో ఘనంగా జరిగింది. ఈ వివాహానికి మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మాదేవేందర్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి మండల నాయకులతో కలిసి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. వీరి వెంట పాపన్నపేట్ మండల పార్టీ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, కొత్తపల్లి ఉప సర్పంచ్ వకిండి. రాము, సర్పంచుల పోరం మాజీ అధ్యక్షులు కుమ్మరి జగన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రెడ్డి,మాజీ సర్పంచులు గురుమూర్తి గౌడ్,శ్రీనాథ్ రావు, నాయకులు సోములు,శ్రీనివాస్ రావు, నర్సింలు గౌడ్,సాయిలు, మల్లేశం, అంజి రెడ్డి,తదితరులు ఉన్నారు.

# కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

**పాపన్నపేట మే21( మహాప్రభ )**
కుటుంబ కలహాలు సంతాన లేమితో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చికోడ్ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటింబికుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బోయిని పర్వయ్య, అనూషమ్మ లకు ఇరువురు కుమారులు కాగా పెద్ద కుమారుడు సంగమేశ్వర్, చిన్న కుమారుడు సాయిబాబా (32) లు కాగా ఇరువురి కుమారులకు వివాహాలు జరుపగా చిన్న కుమారుడు సాయిబాబా పని పాట చేయకుండా జులయిగా తిరిగుతూ సంసారం పట్టింపు లేకుండా తిరుగుతుండడం తో భార్య వాసవి తో తరచు గొడవలు చోటుచేసుకుంటుండమే కాక సంతానం లేక పోవడం మూలంగా గొడవలు జరుగు తుండేవి. బుధవారం భార్య భర్తల మధ్య గొడవ చేసుకోవడం తో మధ్యాహ్నం ఇంటిలోని గదిలోకి వెళ్ళి గడియ వేసుకోవడం తో అనుమానం వచ్చిన భార్య వాసవి,



అత్త అను షమ్మ కు తెలుపడంతో ఇరువురు వెళ్ళి గడియ తీయాలని పిలిచినా పలుక కాపోవడంతో పెద్ద కుమారుడు సంగమేశ్వర్ సహాయం తో గడ్డపార తలుపులు సందు చేసుకొని చూడగా దూలనికి చీర తో ఊరి వేసుకొని ఉండడాన్ని గమనించి వెంటనే పాపన్న పేట పోలీసుల కు సమాచారం అదివ్వడం తో సమాచారం అందుకున్న పాపన్న పేట పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి పంచనామా నిర్వహించి. మృతుడి తల్లి అనూషమ్మ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ధర్యప్తు చేస్తున్నట్లు పాపన్న పేట ఎస్ ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. కాగా మృతుడికి భార్య వాసవి, తల్లి అను షమ్మ ఉన్నారు.

# ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలి

**-- చేయూత పెన్షన్ సర్వే పూర్తి చేయాలి,**
**- అధికారులకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ ఆదేశాలు,**






**కామారెడ్డి, మే 20 (మహాప్రభ)**
ఉపాధి హామీ పథకం పనులు, చేయూత పెన్షన్ సర్వేను అత్యంత ప్రాధాన్యంతో పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఱ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిషోర్ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి రాజు ్రా సీఈఓ దివ్యతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, గ్రామీణాభివృద్ధి అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ గిరితో కలిసి పాల్గొన్నారు. నరేగా పనులను వేగవంతం చేసి ప్రణాళికలో ఉన్న అన్ని పనులను తక్షణమే గ్రౌండింగ్ చేయాలని దానకిషోర్ సూచించారు. జూన్ 30 వరకు నరేగా కొనసాగుతుందని, జూలై 1 నుంచి కొత్తగా వీబీజీ రామ్‌జీ పథకం అమల్లోకి వస్తుందని తెలిపారు. ప్రస్తుతం రోజుకు 15 లక్షల మంది కార్మికులు పనుల్లో పాల్గొంటుండగా, వెంటనే ఆ సంఖ్యను 20 లక్షలకు పెంచాలని ఆదేశించారు. ముందురోజే కూలీల సమీకరణ చేపట్టాలని, గ్రామ హాబిటేషన్ పరిధిలోనే పనులు ఉండేలా చూడాలని పేర్కొన్నారు. ఉదయం 5.30 గంటలకే పనులు ప్రారంభించి, ప్రధాన పనులను 10.30 గంటలలోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.రాబోయే 40 రోజులు ఎంపీడీవోలు పూర్తిగా నరేగా పనులపైనే దృష్టి పెట్టాలని తెలిపారు. అసైన్డ్ భూముల్లో ఫామ్‌పాండ్‌ల నిర్మాణం చేపట్టి రైతులకు ఉపయోగపడేలా చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రత్యేక కార్యాచరణలో భాగంగా మహిళా సంఘ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీ భవనాలు, పాఠశాలల ప్రహరీ గోడలు వంటి నిర్మాణాలను నరేగా కింద చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో సీసీ డ్రెయిన్‌ల శుభ్రత పనులు నిరంతరం నిర్వహించి వర్షాకాలానికి ముందస్తు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి జిల్లాకు రూ.30 కోట్లకు పైగా మెటీరియల్ కంపోనెంట్ నిధులు అందుబాటులో ఉన్నాయని, వాటిని పూర్తిగా వినియోగించుకోవాలని తెలిపారు. వాటర్ హార్వెస్టింగ్ పనుల వివరాలను వెంటనే పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. పనితీరు తక్కువగా ఉన్న మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించాలని, ప్రతి గ్రామపంచాయతీలో కనీసం 20 పనులను గుర్తించాలని సూచించారు. అర్హులైన వారందరికీ కొత్త జాబ్ కార్డులు జారీ చేయాలని తెలిపారు.

**చేయూత పెన్షన్ సర్వేపై దృష్టి,**
రాష్ట్రంలో 41 లక్షల మంది పెన్షన్ లబ్ధిదారులు ఉన్నారని, అందులో 21 లక్షల మందికి పోస్టల్ శాఖ ద్వారా నగదు రూపంలో, మరో 20 లక్షల మందికి బ్యాంకు ఖాతాల ద్వారా పెన్షన్ అందుతోందని దానకిషోర్ తెలిపారు. ఫేస్ రికగ్నిషన్ విధానం అమలుతో మరణించిన లేదా వలస వెళ్లిన లబ్ధిదారుల కారణంగా ఇప్పటికే 20 వేల పెన్షన్లు తగ్గినట్లు వెల్లడించారు. బ్యాంకుల ద్వారా పెన్షన్ పొందుతున్న వారందరికీ లైవ్ అథెంటికేషన్ చేపడుతున్నామని చెప్పారు. ఈ ప్రక్రియను మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు స్వయంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. నగదు రూపంలో పెన్షన్ పంపిణీపై కూడా నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు.

**దివ్యాంగులకు ఆధునిక సదరం కేంద్రాలు,**
సదరం కేంద్రాల్లో సౌండ్‌ప్రూఫ్ పరికరాలు, ఆధునిక వైద్య సదుపాయాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో 80 నుంచి 100 శాతం తీవ్ర దివ్యాంగత కలిగిన 23 వేల మంది ఉన్నారని, కొత్త పింఛన్ల మంజూరులో వారికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

**ఎన్‌పీఏలు సున్నాకి తేవాలి.**
మహిళా సంఘాల బ్యాంకు లింకేజి రుణాల రికవరీపై ఎస్ ఈ ఆర్ పి, సీఈఓ దివ్య, మాట్లాడుతూ ఎన్‌పీఏలను సున్నాకి తీసుకురావడంలో జిల్లాలు ముందుండాలని తెలిపారు. ముఖ్యంగా స్త్రీనిధి రుణాల వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం అమలు బాధ్యత గ్రామీణాభివృద్ధి శాఖకు బదిలీ అయిందని, ఎంపీడీవోలే నోడల్ అధికారులని తెలిపారు. కుటుంబ పోషకుడిని కోల్పోయిన పేద కుటుంబాలకు రూ.20 వేల ఆర్థిక సాయం అందజేస్తామని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఎంపీడీవోలు, ఏపీఎంలతో సమీక్ష నిర్వహించారు. రాబోయే 40 రోజులు కీలకమని పేర్కొంటూ, కూలీల సంఖ్య తక్కువగా ఉన్న భిక్కునూరు, బీబీపేట, బిచ్కుంద, సదాశివనగర్ మండలాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. రేపటి నుంచి జిల్లా, మండల స్థాయి అధికారులు ఉదయం 6.30 గంటలకే ఫీల్డ్‌లో ఉండాలని సూచించారు.వీడియో కాన్ఫరెన్స్‌లో జడ్పీ సీఈఓ చందర్, డీపీఓ మురళి, డీఆర్‌డీఓ సురేందర్, మున్సిపల్ కమిషనర్లు, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, ఎంపీడీవోలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం: రైతులు అధైర్యపడొద్దు

**-జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆకస్మిక తనిఖీ**
**- హైవేపై వాహనాలు ఆపి, మిల్లులకు ధాన్యం తరలింపు**
**-తాలు, తరుగు పేరుతో ఇబ్బంది పెడితే కఠిన చర్యలు: ఎస్పీ హెచ్చరిక**



**దేవరకొండ ( డివిజన్) 21మే (మహాప్రభ):**
ధాన్యం కొనుగోలు వేగవంతం చేసే విషయమై గురువారం అయన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ తో కలిసి నల్గొండ జిల్లా, పీఏ పల్లి మండలం, వ్యవసాయ మార్కెట్ యార్డులోని పిఎసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా హైవేపై ఖాళీ లారీలు , డీసీఎం లాంటి వాహనాలను ఆపి వాటిని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించి ధాన్యాన్ని మిల్లులకు పంపించే ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...దేవరకొండ డివిజన్లో రబీ ధాన్యం కొనుగోలుగో భాగంగా దేవరకొండ డివిజన్లో 69 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలు కు గాను ఇప్పటివరకు 49 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని, దాదాపు ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయని, తక్కినది వారం, పది రోజుల్లో లిఫ్ట్ చేసేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయడం జరిగిందని, రైతులు ఎవరు ఆందోళన పడాల్సిన అవసరం లేదని అధైర్యపడవద్దని తెలిపారు. కొనుగోళ్లు వేగంగా చేసేందుకుగాను జిల్లా యంత్రాంగం అవసరమైన అన్ని చర్లలు తీసుకోవడం జరిగిందని తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్ గుడిపల్లి మండలం, చిలకమర్రి చౌరస్తా లోని లక్ష్మీ దుర్గ రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైస్ మిల్లర్లు ధాన్యం అన్లోడ్ చేసుకోవడంలో జాప్యం చేయవద్దని ఆదేశించారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ మాట్లాడుతూ రైస్ మిల్లర్లు లేదా ఇతరులు తాలు, తరుగు పేరు మీద రైతులను ఇబ్బందులకు గురి చేస్తే తక్షణమే తమకు ఫోన్ చేయాలని, జిల్లా కలెక్టర్ తో పాటు ,తాను, జిల్లా యంత్రాంగం మొత్తం రైతుల కోసం పని చేస్తున్నామని అన్నారు. పౌర సరఫరాల జిల్లా మేనేజర్ రాం పతి నాయక్, ఇతర అధికారులు, తదితరులు ఉన్నారు.

# రైతు ఆత్మహత్య అనే వార్తలు అవస్తవం

**-రైతులు ధైర్యంగా ఉండాలి**
**-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**



**మెదక్ జిల్లా -21మే (మహాప్రభ )**
జిల్లాలో ఇటీవలే ధాన్యం కొనుగోలు కారణంగా రైతు ఆత్మహత్య అనే వార్తలు అవాస్తవమని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఖండించారు . ధాన్యం కొనుగోలు సందర్భంలో రైతు ఆత్మహత్య అనే కథనంపై జిల్లా కలెక్టర్ గురువారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ఆమె మాట్లాడారు కుటుంబ కలహాలు వివిధ కారణాలతోనే జరిగినట్లుగా తెలిపారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి కొన్ని పత్రికల్లో ప్రచురితమైన వార్తల నేపథ్యంలో వాస్తవ పరిస్తితి నివేదిక ప్రకారం రైతు తన కుటుంబం లోని కలహాల కారణంగా ఆత్మహత్య కి పాల్పడినట్లు తెలిసినది. ఇందులో ధాన్యం కొనుగోలు చేయకపోవటం కారణంగా ఆత్మహత్య చేసుకున్నాడు అన్నది అవాస్తవం. అని తెలిపారు.జిల్లాలో ప్రభుత్వం నిర్ణయించిన మార్గదర్శకాల ప్రకారం ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిరంతరం కొనసాగుతోంది. ఇప్పటి వరకు సుమారు 2 లక్షల 11 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగి, రైతుల ఖాతాల్లో రూ.311 కోట్లను 28,521 మంది రైతులకు నేరుగా జమ చేయడం పూర్తయిందని వెల్లడించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో రైతుల సౌకర్యార్థం సీరియల్ విధానంలోనే ధాన్యం కొనుగోలు జరుగుతోంది. ధాన్యం రవాణా, మిల్లులకు కేటాయింపు, అన్‌లోడింగ్ తదితర ప్రక్రియలు పరిస్థితులకు అనుగుణంగా సమన్వయం చేస్తూ నిర్వహించబడుతున్నాయన్నారు.. కొన్ని ప్రాంతాల్లో ఒకేసారి అధికంగా ధాన్యం రావడం వల్ల తాత్కాలికంగా ఆలస్యం జరిగిన సందర్భాలు ఉన్నప్పటికీ, వాటిని వెంటనే పరిష్కరించే చర్యలు తీసుకోవడం జరుగుతోంది. అదేవిధంగా సంబంధిత సివిల్ సప్లైస్ అధికారులు, తహసీల్దార్లు మరియు ఇతర శాఖల అధికారులు నిరంతరం కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. రైతులకు చెల్లింపులు కూడా నిరంతరంగా జరుగుతున్నాయి. కావున రైతులు ఎటువంటి ఆందోళనకు గురికాకుండా అధికార యంత్రాంగానికి సహకరించాలని విజ్ఞప్తి చేయడమైనది. రైతులు ధాన్యం కొనుగోలు ఆలస్యం పట్ల ఎటువంటి ఆందోళనకు గురికాకుండా అధికార యంత్రాంగానికి సహకరించాలని విజ్ఞప్తి చేయడమైనది. ఈ మేరకు సంబంధిత అధికారులకు వేగవంతంగా ధాన్యం కొనుగోలు పూర్తి చేసి మిల్లులకు తరలించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించడమైనది మరియు ఇటువంటి పరిస్థితిలలో రైతులకు ధైర్యం చెప్తూ, తగు చర్యలు తీసుకోవటం జరుగుతుంది.

# గాంధారి మండల సమాఖ్య సమావేశం




**గాంధారి, మే 21 (మహాప్రభ)**
మహిళా సంఘాల అభివృద్ధికి ఎంతో కీలకమైన పంచ సూత్రాలపై కూడా విస్తృతంగా శిక్షణ అధ్యక్షురాలు పుష్పారాణి, కార్యదర్శి అంబ లక్ష్మి, ఏపిఎం ప్రసన్న కుమార్, ఆధ్వర్యంలో మండల సమాఖ్య కార్యనిర్వాహక సభ్యులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిఆర్పీలు వనజ, కళావతి, సభ్యులకు వారి విధులు, బాధ్యతలు, సంఘ బలోపేతానికి సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా మహిళా సంఘాల అభివృద్ధికి ఎంతో కీలకమైన పంచ సూత్రాలపై కూడా విస్తృతంగా శిక్షణ అందించారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా కార్యనిర్వాహక సభ్యులు సంఘ నిర్వహణలో మరింత సమర్థవంతంగా పనిచేయాలని శిక్షణ ఇవ్వడం జరిగింది. మహిళా చట్టాల పైన వార్షిక ఆడిట్ పైన శిక్షణ జరుగుతుంది ఈ కార్యక్రమంలో సిసిలు వివిధ గ్రామ సంఘాల అధ్యక్షురాలు తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధప్రాతిపదికన వరి ధాన్యం కొనుగోలు చేయాలి

**- కలెక్టర్‌కు బిజెపి వినతి**



**మెదక్ జిల్లా -21మే (మహాప్రభ ).**
మెదక్ జిల్లా కలెక్టర్ కి భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా శాఖ తరపున రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో నెలకొన్న తీవ్ర జాప్యం మౌలిక వసతులు లేని తరుగు తేమ పేరుతో జరుగుతున్న దోపిడీలని అరికట్టి యుద్ధ ప్రాతిపదికన రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేపట్టాలని వినతి పత్రం అందజేశారు.. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాములు, సుభాష్ గౌడ్,మాజీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్,ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గడ్డం కాశీనాథ్,జిల్లా ప్రధాన కార్యదర్శి సంగసని సురేష్ రంజిత్ రెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు రాజేందర్ కౌన్సిలర్ శంకర్ గౌడ్ పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ, జిల్లా యువ మోర్చా జిల్లా అధ్యక్షులు సతీష్ ,జిల్లా కార్యదర్శి కల్కి నాగరాజు, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి యం ఎల్ ఎన్ రెడ్డి జిల్లా నాయకులు మల్లారెడ్డి, మనోజ్,భాను,జనార్ధన్, బిక్షపతి,సత్యం,శ్రీనివాస్, విజయ్,మహిళ నాయకులు మల్లికా లావణ్య సంగీత గిరిజన మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు నాయక్, మండల పట్టణ అధ్యక్షులు బెండ వీణ సర్పంచ్ నవీన్ గౌడ్ అవినాష్ రెడ్డి సంతోష్ చారి బిజెపి నాయకులు శ్యామ్ నగేష్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొనడం జరిగింది.

# జప్తిశివనూర్ లో క్రికెటు ప్రీమియర్ లీగ్ మ్యాచ్ సీజన్ (2 )




**మహాప్రభ మే 21 మహాప్రభ**
జప్తిశివనూర్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్ సీజన్ 2 లో పాల్గొన్న క్రికెట్ టీం లలో అందులో విజేతలుగా నిలిచిన క్రికెట్ ఫాస్ట్ విన్నర్ టీం, రాయల్స్ టైగర్, రెండవ క్రికెట్ టీం విన్నర్ సింగం వారు బహుమతులు మేనేజ్మెంట్ వారి ఆధ్వర్యంలో ఆర్గనైజర్స్ శ్రీకాంత్. సాయి వెంకట్ నరేష్ ప్రవీణ్ మహేష్ లు వీరికి బహుమతులు అందజేసి అభినందనలు తెలిపారు . ఇలాంటి మ్యాచ్లు ముందు ముందు ఎన్నో కొనసాగిస్తామని మేనేజ్మెంట్ సభ్యులు తెలిపారు. అలాగే మేనేజ్మెంట్ వారికి సహకరించిన గ్రామ ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# రామాయంపేట మున్సిపాలిటీలో రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు



**రామాయంపేట మే 21 మహాప్రభ**
ఈరోజు రామాయంపేట పట్టణంలో భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ముఖ్య అతిథి గజవాడ లావణ్య నాగరాజు మెదక్ చౌరస్తాలో రాజీవ్ గాంధీ ఫోటోకు పూలమాలలో వేసి నివాళులర్పించడం జరిగింది బ్లాక్ కాంగ్రెస్ నాయకుడు రమేష్ రెడ్డి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సార పు యాదగిరి వై చైర్ పర్సన్ పోచమ్మ ల నవనీత గణేష్ కౌన్సిలర్ పుట్టిసందీప్ తొమ్మిదో పార్డు కౌన్సిలర్. దేవుని రంజిత్ దాకి శ్యామల స్వామి భైరన్ స్వప్న కుమార్ కోఆప్షన్ నెంబర్ చింతల రాధా భవాని మెదక్ డిసిసి ఉపాధ్యక్షులు చింతల యాదగిరి జిల్లా కార్యదర్శి పోచమ్మ గణేష్ పట్టణ అధ్యక్షుడు చింతల స్వామి కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రకాష్ మరియు కాంగ్రెస్ నాయకులు యూత్ నాయకులు పాల్గొన్నారు

# భారత మాజీ ప్రధాని వర్ధంతి వేడుకలు






**గాంధారి, మే 21 (మహా ప్రభ)**
దేశాన్ని ఆధునిక భారత దిశగా నడిపించిన దూరదృష్టి నాయకుడు గాంధారి మండల కేంద్రంలో నెహ్రూ చౌరస్తా వద్ద మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు కాంగ్రెస్ నాయకులు చిత్రపటానికి పూలమాల వేస్తూ నివాళులు అర్పించారు. కొత్త ఆశయాలు చూపించిన ప్రగతిశీల వ్యక్తిత్వం...సాంకేతిక విప్లవానికి పునాది వేసిన మహానేత...ఆయన సేవలు, ఆశయాలు, త్యాగం భారత ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి. రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, పంపిణీ చేశారు. ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల సీనియర్ నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## మళ్లీ పెరిగిన పసిడి ధరలు..

### రూ.1,60,000కు చేరువలో 24 క్యారెట్ల బంగారం



**హైదరాబాద్,**
దేశీయ మార్కెట్లో బంగారం ధరలు మరోసారి పుంజుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో నెలకొన్న ఒడిదొడుకులు, స్థానిక నగల వ్యాపారుల నుంచి డిమాండ్ పెరగడంతో గురువారం బులియన్ మార్కెట్లో పసిడి ధరలు భారీగా పెరిగాయి. హైదరాబాద్, విజయవాడ సహా తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో ఈరోజు పసిడి రేట్లు ఏ విధంగా ఉన్నాయో ఒకసారి చూద్దాం.తెలుగు రాష్ట్రాల్లో నేటి ధరల వివరాలు:24 క్యారెట్ల బంగారం (ప్యూర్ గోల్డ్): నిన్నటి ధరపై రూ. 490 మేర పెరిగి, ప్రస్తుతం 10 గ్రాముల ధర రూ. 1,59,930 వద్ద కొనసాగుతోంది. 22 క్యారెట్ల బంగారం (ఆర్నమెంట్ గోల్డ్): తులానికి (10 గ్రాములు) రూ. 450 పెరిగి, ప్రస్తుతం రూ. 1,46,600 వద్ద విక్రయించబడుతోంది. వెండి ధర: పసిడి బాటలోనే వెండి కూడా పరుగులు పెడుతోంది. మార్కెట్లో కిలో వెండి ధర గరిష్టంగా రూ. 2,90,000 మార్కుకు చేరింది. ధరల పెరుగుదలకు కారణాలు:అంతర్జాతీయంగా ముడిచమురు ధరల హెచ్చుతగ్గులు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై వస్తున్న అంచనాలు ప్రపంచవ్యాప్తంగా పసిడి మార్కెట్‌ను ప్రభావితం చేస్తున్నాయి. దీనికి తోడు మనదేశంలో పెళ్లిళ్ల సీజన్ కావడంతో కొనుగోళ్లు పెరిగి ధరలు మళ్లీ శరవేగంగా రూ.1.60 లక్షల దిశగా దూసుకుపోతున్నాయని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు.(గమనిక: ఇక్కడ పేర్కొన్న ధరలు ఉదయం మార్కెట్ ప్రారంభ సమయానికి సంబంధించినవి. స్థానిక పన్నులు, జీఎస్టీ మరియు మేకింగ్ ఛార్జీల ఆధారంగా షోరూముల్లో ధరల్లో స్వల్ప మార్పులు ఉండే అవకాశం ఉంది.)

## నష్టాల్లో ముగిసిన భారతీయ స్టాక్ మార్కెట్..

### - సెన్సెక్స్ 135, నిఫ్టీ 5 పాయింట్లు పతనం




భారతీయ స్టాక్ మార్కెట్లు గురువారం నష్టాల్లో ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 135.03 పాయింట్లు నష్టపోయి, 75,183.36 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా స్వల్పంగా.. అంటే 4.30 పాయింట్లు నష్టపోయి 23,789 పాయింట్ల వద్ద ముగిసింది. ఉదయం ట్రేడింగ్ లాభాల్లోనే కొనసాగింది. సెన్సెక్స్ ఒకదశలో 500 పాయింట్లు పెరిగింది.ఉదయం లాభాల్లో ప్రారంభమైన మార్కెట్ చివరికి నష్టాల్లో ముగిసింది. క్రూడాయిల్ ధరలు తగ్గడం, ఇరాన్‌తో చర్చలు జరుగుతాయని ట్రంప్ ప్రకటిండచడం ఉదయం మార్కెట్‌కు కలిసొచ్చింది. ఆర్బీఐ రేట్లు పెంచుతుందనే భయం, ద్రవ్యోల్బణం పెరుగుదల, అంతర్జాతీయ పరిణామాలు వంటివి మార్కెట్ నష్టాలకు కారణాలు. ఐటీ, ఎఫ్ఎంసీజీ షేర్లపై ఒత్తిడి పెరగడంతో మార్కెట్ ప్రభావితమైంది. సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫైనాన్స్, టెక్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇన్ఫోసిస్, హిందుస్తాన్ యునీలీవర్ షేర్లు నష్టపోయాయి. అల్ట్రాటెక్, ఇండిగో, అదానీ పోర్ట్స్, ట్రెంట్, బీఈఎల్ షేర్లు లాభాలు చవిచూశాయి.నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.63 శాతం పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధర స్వల్పంగా తగ్గింది. బ్యారెల్ క్రూడాయిల్ ధర 104 డాలర్ల వద్ద కొనసాగింది. బంగారం ఔన్స్ ధర 4518 డాలర్ల వద్ద కొనసాగింది. మరోవైపు గురువారం రూపాయి స్వల్పంగా లాభపడింది. డాలర్‌తో రూపాయి 63 పైసలు బలపడి 96.23కు చేరింది.


## టీనేజర్లకు పేటీఎం బంపర్ ఆఫర్.. కొత్త ఫీచర్ వైరల్

డిజిటల్ చెల్లింపుల దిగ్గజం పేటీఎం టీనేజర్లను లక్ష్యంగా చేసుకుని సరికొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చింది. 'పేటీఎం పాకెట్ మనీ' పేరుతో ప్రారంభించిన ఈ సరికొత్త ఫీచర్ ద్వారా బ్యాంకు ఖాతా లేని టీనేజర్లు సైతం ఇకపై నేరుగా యూపీఐ చెల్లింపులు చేసుకోవచ్చు. నగదు అవసరాల కోసం లేదా చిన్న చిన్న పేమెంట్స్ కోసం ప్రతిసారీ తల్లిదండ్రులపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా ఈ ఫీచర్ తోడ్పడుతుందని కంపెనీ బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రకటనలో తెలిపింది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రవేశపెట్టిన 'యూపీఐ సర్కిల్' ఆధారంగా ఈ సేవలు పనిచేస్తాయి. దీని ద్వారా బ్యాంకు ఖాతా ఉన్న ప్రాథమిక యూజర్ అంటే తల్లి లేదా తండ్రి, తమ పిల్లలను సెకండరీ యూజర్‌గా చేర్చుకోవచ్చు. దీనివల్ల ఒకే అకౌంట్‌తో పిల్లలు కూడా తమ సొంత ఫోన్ల ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి పేమెంట్స్ చేయవచ్చు. ప్రతిసారీ తల్లిదండ్రుల ఫోన్ తీసుకోవడం, ఓటీపీల కోసం వేచి చూడటం లేదా క్యూఆర్ కోడ్‌ను వాట్సాప్‌లో పంపడం వంటి ఇబ్బందులు దీనితో తప్పుతాయి. పిల్లలు దుబారా ఖర్చులు చేయకుండా ఉండేందుకు తల్లిదండ్రులు పూర్తి నియంత్రణ కలిగి ఉండవచ్చు. ఈ ఫీచర్ ద్వారా ప్రతి లావాదేవీకి గరిష్ఠంగా రూ. 5,000, నెలవారీ మొత్తం ఖర్చుకు రూ. 15,000 వరకు పరిమితి విధించారు. భద్రతా కారణాల దృష్ట్యా, ఫీచర్ సెటప్ చేసిన మొదటి 30 నిమిషాల్లో రూ. 500, మొదటి 24 గంటల్లో రూ. 5,000 వరకు మాత్రమే విక్రయాలు జరపడానికి వీలవుతుంది. 'పేటీఎం స్పెండ్ సమ్మరీ' ద్వారా పిల్లల ఖర్చులను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించవచ్చు. అవసరమైతే యాక్సెస్‌ను తక్షణమే రద్దు చేసే అధికారం కూడా వారికి ఉంటుంది. పాఠశాల, కాలేజీ క్యాంటీన్లు, మెట్రో, షాపింగ్ వంటి రోజువారీ అవసరాలకు ఈ ఫీచర్ ఎంతగానో

Paytm


# స్పోర్ట్స్

## జాన్వీతో కలిసి సరదాగా ప్యాట్ కమిన్స్




క్రికెట్, సినిమా.. ఈ రెండు రంగాలకు ఇండియాలో ఉండే క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. తాజాగా ఈ రెండు రంగాలకు చెందిన ఇద్దరు స్టార్స్ ఒకే వేదికపై సందడి చేశారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్, బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హైదరాబాద్‌లో జరిగిన ఓ ఫ్యాన్ ఈవెంట్‌లో కలుసుకున్నారు. ఎప్పుడూ మైదానంలో తన ఫాస్ట్ బౌలింగ్‌తో బ్యాటర్లను భయపెట్టే కమిన్స్.. ఇక్కడ మాత్రం తన సీరియస్‌నెస్‌ను పక్కనపెట్టి జాన్వీతో కలిసి సరదాగా క్రికెట్ ఆడుతూ ఫ్యాన్స్‌ను ఫుల్ ఎంటర్‌టైన్ చేశాడు. హైదరాబాద్‌లో ఈవెంట్‌లో ఓ ఆసక్తికర ఘట్టం చోటు చేసుకుంది. ఫ్యాన్స్‌తో ఇంటరాక్ట్ అయ్యేందుకు స్టేజ్‌పై ఏర్పాటు చేసిన చిన్న క్రికెట్ సెటప్‌లో 'పెద్ది' మూవీ స్టార్ జాన్వీ కపూర్ బ్యాట్ పట్టుకోగా, కమిన్స్ బౌలింగ్ చేశాడు. ఆస్ట్రేలియా స్పీడ్‌స్టర్ సరదాగా వేసిన బంతిని జాన్వీ కాస్త ముందుకు వచ్చి బలంగా షాట్ ఆడింది. అయితే ఎవరూ ఊహించని విధంగా ఆ బంతి నేరుగా వెళ్లి అక్కడే ఉన్న ప్రేక్షకుల్లోకి దూసుకెళ్లింది. సరిగ్గా అదే సమయంలో స్టేజ్ కింద ఓ అభిమాని తన మొబైల్‌లో ఈ ఫన్నీ దృశ్యాలను రికార్డ్ చేస్తున్నాడు. జాన్వీ కొట్టిన బంతి నేరుగా వెళ్లి ఆ ఫ్యాన్ ఫోన్‌కి తగలడంతో ఒక్కసారిగా అంతా షాక్ అయ్యారు. ఈ అనుకోని సంఘటనతో స్టేజ్ మీద ఉన్న జాన్వీ కూడా కంగుతింది. ఆ తర్వాత క్షణాల్లోనే అక్కడి వాతావరణం అంతా నవ్వులు, కేకలతో నిండిపోయింది. ఈ యాక్సిడెంటల్ షాట్, ఆ వెంటనే జాన్వీ ఇచ్చిన రియాక్షన్‌కు సంబంధించిన వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారాయి.ఈ క్యూట్ అండ్ షాకింగ్ ఇన్సిడెంట్ తర్వాత జాన్వీ కపూర్ తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందించింది. బంతి తగిలిన అభిమానికి క్షమాపణలు చెబుతూ ఓ పోస్ట్ పెట్టింది. "నేను కొట్టిన బంతి ఎవరి కంటికైతే తగిలిందో వాళ్ళకి సారీ.. క్రికెట్ ఆడేటప్పుడు నా బ్యాలెన్స్ ఇంకా పూర్తిగా సెట్ కాలేదు, కానీ ఎప్పటికీ నేను చఅవష్మఝశ్రీ-ఖఅఎవ బేబీనే" అంటూ సరదాగా రాసుకొచ్చింది. ఈ పోస్ట్ నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది. గతంలో 'మిస్టర్ అండ్ మిసెస్ మహి' సినిమా కోసం సుమారు 150 రోజుల పాటు కఠినమైన క్రికెట్ శిక్షణ తీసుకుంది జాన్వీ కపూర్. అందుకే ఈమెకు క్రికెట్‌లో మంచి టాలెంట్ ఉ:ది. కోచ్ అభిషేక్ నాయర్ పర్యవేక్షణలో ప్రొఫెషనల్ క్రికెటర్‌లా బ్యాటింగ్, బౌలింగ్ నైపుణ్యాలు నేర్చుకుంది ఈ బ్యూటీ. ఈ ప్రాక్టీస్ సమయంలో జాన్వీకీ చాలా దెబ్బలు కూడా తగిలాయి. ఆ ప్రాక్టీస్ ఇప్పుడిలా పనికొచ్చింది. కమిన్స్, జాన్వీ కలిసిన ఈ అరుదైన క్రికెట్-సినిమా క్రాస్‌ఓవర్ మూమెంట్ ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. సినిమా వాళ్లను చూడటానికి వచ్చిన అభిమానులకు స్టార్ క్రికెటర్ కూడా తోడవడంతో ఈవెంట్‌కు విపరీతమైన క్రేజ్ వచ్చింది. జాన్వీ ఆడిన పవర్‌ఫుల్ షాట్‌పై, పాపం వీడియో తీసుకుంటూ బంతి బారిన పడ్డ ఆ అభిమానిపై నెటిజన్లు రకరకాల మీమ్స్, జోక్స్ క్రియేట్ చేస్తున్నారు. ఏదేమైనా.. రీసెంట్ టైమ్స్‌లో జరిగిన అత్యంత ఫన్నీ అండ్ ఎంటర్‌టైనింగ్ సెలబ్రిటీ ఈవెంట్‌గా ఇది నిలిచిపోయింది అనడంలో ఎలాంటి సందేహం లేదు. పెద్ది సినిమాలో కూడా క్రికెట్ నేపథ్యం ఉంది. మే 22న ఉప్పల్ స్టేడియంలో జరగబోయే మ్యాచ్‌లో పెద్ది సినిమా ప్రమోషనల్ యాక్టివిటీ కూడా ఉంది.

## ఐపీఎల్ రికార్డులను బద్దలు కొట్టిన వైభవ్ సూర్యవంశీ




ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ లో రాజస్థాన్ రాయల్స్ టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ తన రికార్డుల పరంపరను కొనసాగిస్తున్నాడు. జైపూర్‌లో లక్నో సూపర్ జెయింట్స్ విధించిన 221 పరుగుల భారీ టార్గెట్‌ను ఛేదించే క్రమంలో సూర్యవంశీ కేవలం 38 బంతుల్లోనే 93 పరుగులతో విరుచుకుపడ్డాడు. ఈ క్రమంలోనే ఒక ఐపీఎల్ సీజన్ లో 500 పరుగుల మార్కును అందుకున్న అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు. ఇంతకుముందు 2018 లో ఢిల్లీ డెర్‌డెవిల్స్ తరపున 20 ఏళ్ల వయసులో ఈ ఘనత సాధించిన రిషభ్ పంత్ రికార్డును ఈ యువ ఆటగాడు అధిగమించాడు. ప్రస్తుత ఎడిషన్‌లో కనీసం 500 కంటే ఎక్కువ పరుగులు చేసిన బ్యాటర్లలో 236.3 అత్యధిక స్ట్రైక్ రేట్‌తో సూర్యవంశీ మొదటి స్థానంలో నిలిచాడు. ఈ ఇన్నింగ్స్ ద్వారా ఒకే ఐపీఎల్ సీజన్ లో 50 సిక్సర్లు బాదిన మొట్టమొదటి భారతీయ బ్యాటర్‌గా వైభవ్ సూర్యవంశీ సరికొత్త చరిత్ర సృష్టించాడు. ప్రస్తుతం ఈ 2026 సీజన్ లో ఆయన ఖాతాలో మొత్తం 53 సిక్సర్లు ఉన్నాయి. ఒకే ఇన్నింగ్స్‌లో 10 లేదా అంతకంటే ఎక్కువ సిక్సర్లు రెండుసార్లు కొట్టిన రేర్ రికార్డును కూడా ఆయన దక్కించుకున్నాడు. తాజా డేటా ప్రకారం, పవర్‌ప్లేలో అత్యధిక సిక్సర్లు (60 సిక్సర్లు) కొట్టిన జట్టుగా రాజస్థాన్ రాయల్స్ సరికొత్త ఐపీఎల్ రికార్డు నెలకొల్పింది. ఇందులో సూర్యవంశీ ఒక్కడే 37 సిక్సర్లు బాదగా, యశస్వి జైస్వాల్ 12, మిగిలిన టీమ్ సభ్యులు 11 సిక్సర్లు కాంట్రిబ్యూట్ చేశారు.భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్థాన్ రాయల్స్ జట్టుకు వైభవ్ సూర్యవంశీ (93 పరుగులు, 10 సిక్సర్లు, 7 ఫోర్లు) బ్లిస్టరింగ్ స్టార్ట్ ఇచ్చాడు. ఆయనతో పాటు ధ్రువ్ జురెల్ కూడా 38 బంతుల్లో 53 పరుగులతో రాణించడంతో రాయల్స్ జట్టు కేవలం 3 వికెట్లు కోల్పోయి సులువుగా విజయాన్ని అందుకుంది. ఈ అద్భుత విజయంతో రాజస్థాన్ రాయల్స్ టీమ్ 14 పాయింట్లతో ఐపీఎల్ పాయింట్ల పట్టికలో నాలుగో స్థానానికి దూసుకెళ్లింది.

## పాండ్యాకు మ్యాచ్ ఫీజులో భారీ కోత..

### ఒక డీమెరిట్ పాయింట్..!



ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌లో నాయకుడిగా, ఆటగాడిగా దారుణంగా విఫలమైన హార్దిక్ పాండ్యా కు జరిమానా పడింది. ఐపీఎల్ నియమావళిని ఉల్లఘించినందుకు అతడు మ్యాచ్ ఫీజులో 10 శాతం కోల్పోనున్నాడు. మ్యాచ్ సమయంలో క్రికెట్ వస్తువులు(బ్యాట్, బంతి, వికెట్లు, గ్లోవ్స్, బెయిల్స్) పట్ల దురుసుగా ప్రవర్తించినందుకు అతడికి రిఫరీ రాజీవ్ సేథ్ జరిమానా విధించాడు.అసలేం జరిగిందంటే.. ఈడెన్ గార్డెన్స్‌లో బుధవారం కోల్‌కతా నైట్ రైడర్స్, ముంబై ఇండియన్స్ ఢీకొన్నాయి. కోల్‌కతా ఇన్నింగ్స్ సమయంలో 10వ ఓవర్ వేసిన పాండ్యా.. నాలుగో బతికి రనప్ కోసం నడుచుకుంటూ వెళ్తూ చేతితో బెయిల్స్‌ను నెట్టేస్తున్నట్టు బలంగా తాకాడు. దాంతో, అవి కిందపడిపోయాడు. అతడి చర్యను తీవ్రంగా పరిగణించిన పాండ్యాను విచారణకు పలిచాడు రిఫరీ రాజీవ్ సేథ్. ఐపీఎల్ నియమావళిలోని ఆర్టికల్ 2.2ను పాండ్యా ఉల్లంఘించాడని రిఫరీ తెలుపగా.. తాను నేరం చేశానని ముంబై కెప్టెన్ అంగీకరించాడు. దాంతో, రిఫరీ అతడికి మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానా విధించాడు. ఒక డీమెరిట్ పాయింట్ కూడా కేటాయించాడు. కోల్‌కతా చేతిలో ఘోర ఓటమి అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. సీజన్ ఆసాంతం పేలవ ఫీల్డింగ్ తమ కొంపముంచిందని పాండ్యా తెలిపాడు.

**రాజస్థాన్ రాయల్స్‌తో**
ఐదుసార్లు ఛాంపియన్ ముంబై ఇండియన్స్ 19వ సీజన్‌లో అనూహ్య తడబాటుతో ప్లే ఆఫ్స్ నుంచి నిష్క్రమించింది. లీగ్ దశను హ్యాట్రిక్ విజయాలతో ముగిద్దామనుకుంటే కోల్‌కతా నైట్ రెడర్స్ ముంబైని దెబ్బకొట్టింది. ఈడెన్ గార్డెన్స్‌లో హార్దిక్ పాండ్యా బృందాన్ని 147కే నిలువరించిన కేకేఆర్ స్వల్ప లక్ష్యాన్ని 18.5 ఓవర్లలోనే ఛేదించి నాకౌట్ అవకాశాల్ని మెరుగుపరచుకుంది. చివరి లీగ్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌తో మే 24న ముంబై తలపడనుంది.



## అందాలు ఆరబోసిన మిల్కీ బ్యూటీ

# మెగాస్టార్ చిరంజీవి హీరోగా 158వ చిత్రం

## క్లాప్ కొట్టిన తమ్ముడు పవన్ కళ్యాణ్



మెగాస్టార్ చిరంజీవి హీరోగా 158వ చిత్రం గురువారం మొదలైంది. కె.ఎస్.రవీంద్ర (బాబీ కొల్లి) దర్శకత్వంలో కె.వి.ఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై కె. నారాయణ నిర్మిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోలో పూజా కార్యక్రమాలతో ఈ చిత్రం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ క్లాప్ కొట్టారు. చిరంజీవి కుమార్తె సుస్మిత కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకుడు వి.వి.వినాయక్ గౌరవ దర్శకత్వం వహించారు. అయితే ఈ సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆసక్తికర విషయాలు చోటు చేసుకున్నాయి. అన్నపూర్ణ స్టూడియోకు చిరంజీవి, తన సోదరుడు పవన్‌కల్యాణ్ ఒకే కారులో వచ్చారు. తదుపరి నాగబాబు జాయిన్ అయ్యారు. ముగ్గురు కలిసి ఒకే సోఫాలో కూర్చుని చక్కగా ముచ్చటించుకున్నారు. చిరంజీవి పక్కన ఉన్నంత సేపు పవన్ ఎంతో వినయంగా ఉన్నారు. ఈ దృశ్యాన్ని చూసి అభిమానులు సంబరపడిపోయారు. చాలాకాలం తర్వాత ముగ్గురు సోదరులను ఒకే వేదికపై చూడటం కనుల విందుగా ఉందంటూ కామెంట్స్ చేస్తున్నారు. అలాగే చిరంజీవి, పవన్ కల్యాణ్, రామ్‌చరణ్ ఫొటోలను చిత్రించిన పట్టు శాలువాతో చిరంజీవిని సన్మానించింది చిత్ర బృందం. మరో ఆసక్తికర విషయం ఏంటంటే.. పవన్‌కల్యాణ్‌కి భక్తుడైన బండ్ల గణెళిశ్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బండ్లను చూడగానే పవన్ దగ్గరకు తీసుకుని భుజంపై చేయి వేసి మాట్లాడుతూ లోపలికి తీసుకెళ్లారు. ఆ కాసేపు బండ్ల మొహం హై వోల్టేజ్ బల్బ్‌లా వెలిగిపోయింది. ఎప్పటిలాగే వినయంగా చేతులు కట్టుకుని మాట్లాడారు బండ్ల గణెళిశ్. చిరంజీవి సైతం బండ్లను హత్తుకున్నారు. అభిమానులు మాత్రం 'బండ్లన్నకు ఇవాళ పండగే.. ఆయన అభిమానించే హీరోలతో సరదాగా కాసేపు ముచ్చటించారు. ఈ రోజు ఆయనకు నిద్ర పట్టదేమో' అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి అనశ్వర రాజన్ కూడా హాజరయ్యారు. ఈ చిత్రంలో ఆమె చిరుకు కుమార్తెగా కనిపించనున్నట్లు టాక్ నడుస్తోంది.



# ఉప్పెనను మించిన ట్విస్ట్ ఉంటుంది



రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న చిత్రం 'పెద్ది'. జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రచారంలో భాగంగా బుచ్చిబాబు, రామ్ చరణ్ కార్ డ్రైవ్ చేస్తూ ఇంటర్వ్యూ నిర్వహించారు. 'మీకు ఇష్టమైన ఎపిసోడ్ ఏది?' అని దర్శకుడు అడగ్గా.. 'దిల్లీ ఎపిసోడ్ చాలా బాగుంటుంది. సినిమాలో నాకు ఇష్టమైన పార్ట్ అది. 'పెద్ది' మొత్తంలో ఎక్కువ మలుపులు ఉండేది ఆ ఎపిసోడ్‌లోనే కదా.. ఉప్పెనలో ట్విస్ట్ కంటే 100రెట్లు ఎక్కువ ఉంటుంది ఆ ఎపిసోడ్ అని చెప్పారు

# చిరుకు కూతురుగా అనస్వర

చిత్రపరిశ్రమలో ఎప్పుడు ఎవరిని అదృష్టం వరిస్తుందో చెప్పడం చాలా కష్టం. కొంతమందికివరుస విజయాలు అందుకున్నా కొన్నిసార్లు ఛాన్స్ లు రావు. మరికొంతమందికి ఒక్క సినిమా చేసినా మెగా ఛాన్స్ వచ్చేస్తోంది. తాజాగా మలయాళ బ్యూటీ అనస్వర రాజన్ రెండో కేటగిరిలో ఉందని చెప్పొచ్చు. చిన్న చిన్న పాత్రలు చేస్తూ కెరీర్ ను ప్రారంభించిన ఈ బ్యూటీ ప్రస్తుతం స్టార్ హీరోయిన్ గా కొనసాగుతోంది.ఛాంపియన్ సినిమాతో అనస్వర తెలుగు ఇండస్ట్రీక్రి పరిచయమైంది. రోషన్ హీరోగా ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహించిన ఈ సినిమా గతేడాది రిలీజ్ అయ్యి మిక్స్డ్ టాక్ ను అందుకుంది. సినిమా ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయినా అనస్వర న్యాచురల్ యాక్టింగ్ కి తెలుగు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. అమ్మడికి టాలీవుడ్ లో మంచి భవిష్యత్ ఉంటుందని జోస్యం కూడా చెప్పారు. ఇప్పుడు ఆ జోస్యం నిజమైంది. ఈ చిన్నది తన రెండో సినిమానే మెగాస్టార్ చిరంజీవితో చేస్తోంది. మెగాస్టార్ చిరంజీవి– బాబీ కొల్లి కాంబోలో వస్తోన్న చిత్రం మెగా 158. కెవిఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తోన్న ఈ చిత్రం తాజాగా పూజా కార్యక్రమాలను పూర్తిచేసుకుంది. ఈ ప్రారంభోత్సవంలో పవన్ కళ్యాణ్ ముఖ్యఅతిథిగా పాల్గొనడం విశేషం. చిరంజీవిపై చిత్రీకరించిన ప్రారంభ సన్నివేశానికి పవన్ కళ్యాణ్ క్లాప్ కొట్టారు. ఇక ఈ చిత్రంలో అనస్వర ఒక కీలక పాత్రలో నటించబోతోంది. చిరుకు కూతురిగా ఆమె నటిస్తోందని తెలుస్తోంది. మెగాస్టార్ సినిమాలో ఒక చిన్న పాత్ర చేసినా అది ఈ తరం నటీనటులకు అచీవ్ మెంట్ అని చెప్పొచ్చు. ఎన్నోఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్న హీరోయిన్లకు రాని మెగా ఛాన్స్ రెండో సినిమాకే ఈ మలయాళ బ్యూటీకి దక్కడం నిజంగా ఆమె అదృష్టమని నెటిజన్స్ అంటున్నారు. ఏది ఏమైనా అనస్వర నక్కతోక తొక్కింది అని ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

# కలకాలం గుర్తుండిపోవాలి



'ప్రేమలు' చిత్రంతో దక్షిణాది పరిశ్రమను ఒక్కసారిగా ఆకర్షించింది మలయాళీ సోయగం మమితా బైజు. ప్రస్తుతం ఈ భామ వరుస సినిమాలతో బిజీగా ఉంది. తమిళంలో సీఎం విజయ్‌తో కలిసి నటించిన 'జన నాయగన్' త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నది. తెలుగులో సూర్య సరసన 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రంలో నటిస్తున్నది. ఇలా ఈ ముద్దుగుమ్మ సినిమాల లైనప్ భారీగానే ఉంది.అనతికాలంలో అగ్ర కథానాయికగా పేరు తెచ్చుకోవడం ఆనందంగా ఉందని, నటిగా తాను నిర్దిష్టమైన లక్ష్యాన్ని పెట్టుకున్నానని చెబుతున్నది మమితా బైజు. 'ఉత్తమ కథా చిత్రాల్ని ఎంచుకొని సవాళ్లతో కూడిన పాత్రలు చేయాలనుంది. నన్ను ఎప్పటికీ ఇష్టపడేలా అభిమానుల ప్రేమను పొందాలి. ఇండస్ట్రీ నుంచి రిటైర్ అయ్యాక గడచిపోయిన రోజులు గుర్తుకువస్తే హృదయం ఆనందంతో నిండిపోవాలి. నటిగా కలకాలం గుర్తుండిపోవాలి. అదే నా లక్ష్యం' అని చెప్పుకొచ్చింది మమితాబైజు.

# డ్రాగన్‌కు 64 మిలియన్ల వ్యూస్




పొరపాటున కూడా నా కలలోకి రావొద్దు' అంటూ రికార్డును తన ఖాతాలో వేసుకున్నారు అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్. ఆయన ప్రధాన పాత్రలో ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న చిత్రం 'డ్రాగన్' తారక్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుంచి మొదటి అప్‌డేట్‌గా గ్లింప్స్‌ను విడుదల చేశారు. 4 నిమిషాలు ఉన్న ఈ వీడియో సోషల్ మీడియాను షేక్ చేసింది. ఇప్పుడు రికార్డును కూడా నమోదు చేసింది. 24 గంటల్లో 'డ్రాగన్' గ్లింప్స్ 64 మిలియన్లకు పైగా వ్యూస్‌ను సొంతం చేసుకున్నట్లు టీమ్ తెలిపింది. ఇప్పటివరకూ ఇండియాలో ఏ సినిమా గ్లింప్స్‌నకు ఇన్ని వ్యూస్ రాలేదని వెల్లడించింది. ఇది ఆల్‌టైం రికార్డు అంటూ పోస్టర్ విడుదల చేసింది. ఇది కేవలం ఆరంభం మాత్రమేనని భవిష్యత్తులో మరిన్ని రికార్డులు రావడం ఖాయమంటూ ఫ్యాన్స్ భావిస్తున్నారు. తాజాగా విడుదల చేసిన గ్లింప్స్‌లో ఎన్టీఆర్ 'డ్రాగన్'గా రక్తపాతం సృష్టించే శక్తిమంతమైన పాత్రలో కనిపించారు. విజువల్స్ ప్రత్యేకమైన కథా ప్రపంచాన్ని ఆవిష్కరించాయి. 'కె.జి.ఎఫ్' చిత్రాలతో పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల్ని అలరించిన దర్శకుడు ప్రశాంత్‌నీల్ 'సలార్' తర్వాత తెరకెక్కిస్తున్న సినిమా ఇది. ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జూన్ 11న ప్రేక్షకుల ముందుకురానుంది.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com